# ప్రజా పిలుపు

ప్రజల గొంతు - ప్రజల కోసం

PEOPLE VOICE

PRAJA PILUPU

RNI:TGTEL/26/A5230

సంగారెడ్డి బుధవారం 24.06. 2026 సంపుటి : 01 సంచిక : 02 పేజీలు : 08 వెల: రూ.5

Sangareddy Wednesday 24.06.2026 Volume:01 Issue 02 Pages 08 Cost 5/


## 'రేవంత్ అడిగారు..నేను ఏర్పాటు చేశా'

### ఎక్స్‌లో కిషన్ రెడ్డి పోస్ట్



**న్యూఢిల్లీ, జూన్ 23:** ఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు కేంద్ర మంత్రులతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి సోమవారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో, మంగళవారం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌తో రేవంత్ సమావేశమయ్యారు. ప్రధానంగా హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 విస్తరణపైనే చర్చ జరిగింది. రేవంత్‌తో కలిసి కేంద్ర మంత్రులను కలవడంపై కిషన్ రెడ్డి సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు.'కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయించాలని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి రెండు సార్లు నాకు లేఖ రాశారు. 22వ తేదీన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో, 23వ తేదీన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌తో సమావేశం ఏర్పాటు చేయించాను. మెట్రో రైల్ విస్తరణపై సాను కూల వాతావరణంలో చర్చలు జరిగాయి. తెలంగాణ నుంచి కేంద్ర కేబినెట్ మంత్రిగా ఉన్న నేను రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం ఎల్లవేళలా పని చేస్తా' అని ఎక్స్‌లో కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# రూ.1600 కోట్ల విలువైన బొగ్గు మాయం

## సింగరేణిని కుంభకోణాల గనిగా మార్చారు

- ఓపెన్ కాస్ట్ ఓబీలో భారీ ఎత్తున అవినీతి, అక్రమాలు
- ఓబీ టెండర్లలో పెద్ద ఎత్తున గోల్‌మాల్

### భట్టి విక్రమార్క పర్యవేక్షణలోనే ఈ అక్రమాలు

### ➤ మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు



**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 23:** కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణిని కుంభకోణాల గనిగా మార్చిందని మాజీ మంత్రి హరీశ్ రావు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలతో సింగరేణి పూర్తిగా నిర్వీర్యం అవుతోందని, 137 ఏళ్ల సుదీర్ఘ చరిత్రలోనే ఎన్నడూ లేనంతగా ప్రస్తుతం అత్యంత దయనీయ స్థితికి చేరుకుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓపెన్ కాస్ట్ ఓబీ (ఓవర్ బర్డెన్) టెండర్లలో భారీ ఎత్తున అవినీతి, అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని మండిపడ్డారు. సైట్ విజిట్ పేరుతో సరికొత్త నాటకానికి తెరలేపి, ఓబీ టెండర్లలో పెద్ద ఎత్తున గోల్‌మాల్‌కు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారంలో ఉప ముఖ్యమంత్రి, భట్టి విక్రమార్క పాత్ర అత్యంత కీలకమని, ఆయన పర్యవేక్షణలోనే ఈ అక్రమాలు సాగాయని హరీశ్ రావు స్పష్టం చేశారు. ప్రస్తుతం సింగరేణిలో సుమారు 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైపోవడంపై తీవ్ర స్థాయిలో చర్చ జరుగుతోందని హరీశ్ రావు పేర్కొన్నారు. అంత పెద్ద మొత్తంలో మాయమైన బొగ్గు ఎక్కడ ఉందో యాజమాన్యం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దాదాపు రూ.1600 కోట్ల విలువైన బొగ్గును మాయం చేసి, దానికి పన్నులు ఎలా చెల్లించారో లెక్కలు తేలాల్సి ఉందన్నారు. అసలు తవ్వని బొగ్గుకు పన్నులు కట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని, ఏ ప్రాతిపదికన డీఎంఎఫ్‌టీ నిధులు కేటాయించారో సమాధానం చెప్పా లని ప్రశ్నించారు. ఒకప్పుడు లాభాల బాట లో పయనిస్తూ, కార్మికులకు అండగా నిలి చిన సింగరేణిని.. నేడు కాంగ్రెస్ ప్రభు త్వం కుంభకోణాల గనిగా మార్చేసిందని తీవ్రంగా విమర్శించారు.

## ఉద్యోగులకు తెలంగాణ సర్కార్ గుడ్‌న్యూస్



**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఉద్యోగులు, పెన్షనర్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఉచిత జీవిత బీమా పథకాన్ని రేపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈ కార్యక్రమం జరగనుంది. ఈ పథకం కింద అర్హులైన ఉద్యోగులు, పెన్షనర్లకు రూ.1.20 కోట్ల వరకు ఉచిత జీవిత బీమా రక్షణ కల్పించనున్నారు. సహజ మరణం, ప్రమాద మరణం వంటి సందర్భాల్లో బీమా ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ పథకాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు బ్యాంకులతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ఉద్యోగులు, పెన్షనర్ల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.

## సిట్ అదుపులో కృష్ణలంక మాజీ సీఐ



**విజయవాడ,జూన్23:** గాదె సాయికృష్ణ మిస్సింగ్ కేసులో సస్పెండైన కృష్ణలంక సీఐ నాగరాజును సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన్ను కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని సిట్ కార్యాలయానికి తరలించి విచారిస్తున్నారు. అంతకు ముందు సింగ్‌నగర్ లోని నాగరాజు నివాసం వద్దకు మద్దతుదారులు చేరుకోవ డంతో భారీగా పోలీసులు మోహరించారు. సీఐను సిట్ కార్యాలయానికి తరలిస్తున్న క్రమంలో ఆయన మద్దతు దారులు.. పోలీసులను అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. మాకు రక్షణ మీరేనంటూ పోలీసులకు అనుకూలంగా నినాదాలు చేశారు.

### సీసీ కెమెరాలపై బట్ట కప్పి.. గర్భగుడి తాళాలు పగులగొట్టి..

## బాసర ఆలయంలో చోరీ




**బాసర :** నిర్మల్ జిల్లా బాసర జ్ఞాన సరస్వతి ఆలయంలో భారీ చోరీ జరిగింది. సరస్వతి అమ్మవారి ఆలయంలోని పై అంతస్తులో ఉన్న మహంకాళి అమ్మవారి వెండి కిరీటంతో పాటు హుండీని దుండగులు ఎత్తుకెళ్లారు. గర్భగుడి తాళాలు పగులగొట్టి మరీ ఈ దోపిడీకి పాల్పడటం స్థానికంగా కలకలం రేపింది. మంగళవారం తెల్లవారు జామున సుప్రభాత సేవ, పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాస్ గుడికి వచ్చిన సందర్భంగా తాళాలు పగులగొట్టి ఉండటం గుర్తించాడు. వెంటనే ఈ విషయాన్ని ఆలయ భద్రతా సిబ్బందికి సమాచారం అందించారు. ఆలయ భద్రతా సిబ్బంది ఇచ్చిన సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆలయ పూజారి చేత తలుపులు తెరిపించారు. ఆ సమయంలో అమ్మవారికి అలంకరించిన వెండి కిరీటంతో పాటు హుండీని అపహరించినట్లు పోలీసులు గుర్తించారు.కాగా, సీసీ కెమెరాలపై వస్త్రాలు కప్పి దొంగలు ఆలయంలోకి ప్రవేశించినట్లుగా పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. చోరీకి పాల్పడిన హుండీలో నుంచి డబ్బులు తీసుకుని, తర్వాత హుండీని వ్యాసగుడి సమీపంలో పడేసినట్లుగా పోలీసులు గుర్తించారు. బాసర ఆలయంలో చోరీ గురించి సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల ఘటనాస్థలిని పరిశీలించారు. చోరీ జరిగిన తీరు, సేకరించిన ప్రాథమిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీల పరిశీలన తదితర అంశాలపై అధికారులతో సమావేశమయ్యారు. కేసును అన్ని కోణాల్లో విచారించి నిందితులను త్వరితగతిన అరెస్టు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

### కుల రాజకీయాలను

## తిప్పికొట్టాలి

### ఏపీ సీఎం చంద్రబాబు



**అమరావతి**: కేబినెట్ సమావేశం అనంతరం ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలు కీలక వ్యాఖ్యలు చేశారు. క్రిమినల్స్‌ను వైసీపీ వెనకేసుకొస్తూ రాజకీయం చేస్తోందన్నారు. వైసీపీ నేతలు కుల మీటింగ్‌లు పెడుతూ కులాల మధ్య చిచ్చు పెట్టే కుట్రల్ని దీటుగా తిప్పికొట్టాలని పిలుపుని చ్చారు. కర్నూలులో ఇటీవల చోటుచేసుకున్న ఘటనను ప్రస్తావించిన సీఎం, గ్రామస్థులే బహిష్కరించిన వ్యక్తులకు వైసీపీ మద్దతుగా నిలవడం విచారకరమని వ్యాఖ్యానించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను అనవసర వివాదాల్లోకి లాగేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, అలాంటి సంద ర్భాల్లో కూటమి ఐక్యతను చాటే విధంగా మంత్రులంతా స్పందించాలని సూచించారు. ప్రభుత్వ పనితీరును మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలంటే ప్రతి మంత్రి అన్ని శాఖలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. అభి వృద్ధి కార్యక్రమాలపై కూడా సీఎం కీలక ప్రకటనలు చేశా రు. జొన్నగిరి గ్రామాన్ని 'స్వర్ణ గ్రామం'గా నామకరణం చేయాలని ప్రతిపాదించారు. అలాగే జూలై 3న కడప స్టీల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేయనున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు.

### పద్మశ్రీ పురస్కారాలు

## అందుకున్న మురళీమోహన్, రాజేంద్రప్రసాద్



**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పద్మ అవార్డులు- 2026ను ప్రకటించిన విషయం తెలిసిందే. వివిధ రంగాల్లో విశేష సేవలందించే వారికి ఇచ్చే పద్మ పురస్కారాల వేడుక రాష్ట్రపతి భవన్‌లో జరిగింది. గత నెల 25న 66 మంది ప్రముఖులకు రాష్ట్రపతి అవార్డులను అందజేయగా.. మంగళవారం 47 మందికి అవార్డులు ప్రదానం చేస్తున్నారు. సినీ రంగం నుంచి ప్రముఖ తెలుగు నటులు రాజేంద్ర ప్రసాద్, మురళీ మోహన్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. మలయాళ స్టార్ యాక్టర్ మమ్ముట్టికి పద్మభూషణ్, తమిళ నటుడు ఆర్ మాధవన్‌లకు పద్మశ్రీ పురస్కారాన్ని రాష్ట్రపతి అందజేశారు.తెలంగాణ నుంచి ఏడుగురికి పద్మశ్రీ పురస్కారాలు దక్కాయి. వీరిలో గడ్డమనుగు చంద్రమౌళి (సైన్స్), దీపికా రెడ్డి (నృత్యకారిణి), గూడూరు వెంకట్రావు (వైద్యం), కృష్ణమూర్తి బాల సుబ్రహ్మణియన్ (సైన్స్, ఇంజినీరింగ్), కుమారస్వామి తంగరాజ్ (సైన్స్, ఇంజినీరింగ్), పాల్కొండ విజయ్ ఆనంద్ రెడ్డి (వైద్యం), రామారెడ్డి మామిడి (మరణానంతరం) (పశు సంవర్ధక, పాడి పరిశ్రమ) ఉన్నారు. యూజీసీ మాజీ చైర్మన్ మామిడాల జగదీశ్ కుమార్‌కు ఢిల్లీ కోటాలో పద్మశ్రీ వరించింది. ఏపీ నుంచి నటుడు గద్దె బాబూ రాజేంద్రప్రసాద్ (కళలు), మాగంటి మురళీ మోహన్ (కళలు), గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ (కళలు), వెంపటి కుటుంబ శాస్త్రి (సాహిత్యం)కి పద్మశ్రీ ప్రకటించారు.

ప్రజా పిలుపు
PRAJA PILUPU
RNI:TGTEL/26/A5230



### ప్రచారంలో కాదు..

# కష్టాల్లో అండగా నిలుస్తాం

- కాంగ్రెస్‌కు షాక్
- 50మంది యువకుల బీఆర్ఎస్‌లో చేరిక
- గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించిన రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి





**ప్రజా పిలుపు , జూన్ 23 సంగారెడ్డి:**

జిల్లా యువతను ఎన్నికల ప్రచారానికి మాత్రమే పరిమితం చేయకుండా, వారికి కష్టసుఖాల్లో అండగా నిలబడటమే నిజమైన నాయకత్వ లక్షణమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి అన్నారు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన సుమారు 50 మంది యువకులు ఆ పార్టీ నాయకత్వంపై అసంతృప్తితో సోమవారం నాడు సాయంత్రం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి,మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి యువకులకు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ..నాయకుడి కోసం, పార్టీ కోసం పగలు రాత్రి కష్టపడే యువతను ఎన్నికల సమయంలో, ప్రచార కార్యక్రమాల్లో మాత్రమే గుర్తు చేసుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. పార్టీ కోసం నిలబడిన వారికి అవసరం వచ్చినప్పుడు అండగా నిలవడం, వారి కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావడం కూడా నాయకుల బాధ్యతేనని చెప్పారు. యువతను ఉపయోగించుకుని వదిలేయడం కాకుండా వారికి భరోసాగా నిలిచే నాయకత్వాన్ని చూసే నేడు పలువురు యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. కార్యకర్తల గౌరవం, యువత సంక్షేమానికి బీఆర్ఎస్ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. కుమార్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ యువతకు అవకాశాలు కల్పిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేసే పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని అన్నారు. యువత పార్టీలో చేరడం భవిష్యత్ రాజకీయ పరిణామాలకు నాంది పలుకుతుందని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరిన వారిలో నవీన్, జహంగీర్, విష్ణు, అఖిల్, తేజ, సందీప్ రెడ్డి, మహేందర్, సిద్ధు, మనోహర్, మల్లేష్, సందీప్,బన్నీతో పాటు పలువురు యువకులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సురభి కుమార్ గౌడ్, సంజీవరెడ్డి, కిషన్, పార్టీ నాయకులు, హుస్సేన్, తుపాకుల రాజు, వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,సత్యనారాయణ, శేఖర్ రెడ్డి,మహేష్, మురళి, గౌస్ రవి, భాస్కర్, సాయి కార్యకర్తలు పాల్గొన్నారు.

---

# సిగాచి బాధితులకు పూర్తి నష్టపరిహారం ఎప్పుడిస్తారు?

**ప్రభుత్వాన్ని ప్రశ్నించిన పటాన్‌చెరు నియోజకవర్గ సమన్వయకర్త ఆదర్శ్ రెడ్డి, మండల ఇన్‌చార్జి గడీల శ్రీకాంత్ గౌడ్**



**ప్రజా పిలుపు : జూన్ 23, పటాన్‌చెరు :**

సిగాచి పరిశ్రమ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు, గాయపడిన బాధితులకు ప్రభుత్వం ఇప్పటికీ పూర్తి స్థాయిలో న్యాయం చేయలేదని పటాన్‌చెరు నియోజకవర్గ సమన్వయకర్త ఆదర్శ్ రెడ్డి, పటాన్‌చెరు మండల ఇన్‌చార్జి గడీల శ్రీకాంత్ గౌడ్ ఆరోపించారు. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని గడీల శ్రీకాంత్ గౌడ్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ప్రమాదం జరిగిన వెంటనే ఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాలను పరామర్శించి, వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిన నాయకుడు హరీష్ రావు అని పేర్కొన్నారు. బాధితులకు తక్షణ ఆర్థిక సహాయం, శాశ్వత నష్టపరిహారం, కుటుంబ సభ్యులకు ఉపాధి, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తీసుకువచ్చారని తెలిపారు.ప్రమాదం జరిగి చాలా కాలం గడిచినా పలువురు బాధిత కుటుంబాలకు పూర్తి నష్టపరిహారం అందలేదని, గాయపడిన కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న నష్టపరిహారాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.సిగాచి బాధితుల సమస్యలు రాష్ట్రవ్యాప్తంగా చర్చకు రావడానికి హరీష్ రావు చేసిన కృషి కారణమని పేర్కొంటూ, బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడి, మానవతా దృక్పథంతో వ్యవహరించి బాధిత కుటుంబాలకు పూర్తి నష్ట పరిహారం అందించాలని, మృతుల కుటుంబాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, గాయపడిన కార్మికులకు దీర్ఘకాలిక వైద్య సహాయం, ఉపాధి భద్రత కల్పించాలని కోరారు.జూన్ 30న ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని బీపీఎల్ చౌరస్తాలో సిగాచి బాధితుల సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రమాదంలో మృతి చెందిన వారికి నివాళులు అర్పించడంతో పాటు బాధితుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే వేదికగా ఈ సభ ఉంటుందని చెప్పారు. కార్మికులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, బాధిత కుటుంబాలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఇస్నాపూర్ మున్సిపల్ చైర్మన్ మోట శ్రీకాంత్, కౌన్సిలర్లు బేగరి గాయత్రి పాండు, మచ్చ కిషోర్ రెడ్డి, ఎల్లకొండ రాహుల్ రెడ్డి, బూరిగారి నరేందర్ రెడ్డి, బేగరి వెంకటేష్, వడ్డెగడ్డ రాజు, జనార్ధన్ రెడ్డి, పెలిమెల వెంకట్, కొమిరిశెట్టి అరుణ్, గొంగోళ్ల నవీన్ రెడ్డి, సహనియమిత సభ్యుడు విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

---

## చెక్ డ్యాంలో గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యం

**ప్రజా పిలుపు : మెదక్ జిల్లా పాపన్నపేట, జూన్ 23:**



మండల పరిధిలోని ఏడుపాయల చెక్ డ్యాంలో సుమారు 55 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యమైనట్లు పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మంగళవారం చెక్ డ్యాంలో వృద్ధురాలి మృతదేహాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందజేయడంతో, పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. అనంతరం మృతురాలి ఆచూకీ కోసం పరిశీలించినప్పటికీ ఎలాంటి వివరాలు లభించలేదని తెలిపారు. మృతురాలు నీలం రంగు నైటీ ధరించి ఉండగా, చెవులకు రెడీమేడ్ కమ్మలు, ముక్కుకు పుడక ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. మృతురాలి ఫోటో ఆధారంగా ఎవరైనా గుర్తించినట్లయితే పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ (87126 57920), రూరల్ సీఐ కృష్ణమూర్తి (87126 57883)లను సంప్రదించాలని కోరారు.మృతురాలి వివరాలు తెలియాల్సి ఉండటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

---

# భారీ వర్షంతో జలమయమైన రామచంద్రారెడ్డి నగర్ కాలనీ

**బాధిత ప్రాంతాలను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్**



**ప్రజా పిలుపు : జూన్ 23 : రామచంద్రపురం:**

సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో రామచంద్రపురం డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతమైన రామచంద్రారెడ్డి నగర్ కాలనీలో నీరు నిలిచిపోవడంతో మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.గత రాత్రి 12.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైన నేపథ్యంలో ఉదయం 5 గంటల నుంచే డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల ప్రజలతో ఫోన్ ద్వారా మాట్లాడి పరిస్థితులను తెలుసుకున్నారు. ఎక్కడైనా వర్షపు నీరు నిలిచిపోతే వెంటనే సమాచారం అందించాలని, సంబంధిత వర్షాకాల ప్రత్యేక బృందాలను పంపించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా



రామచంద్రారెడ్డి నగర్ కాలనీలోని రోడ్డు నంబర్లు 2, 3 ప్రాంతాల్లో నీరు నిలిచి అపార్ట్‌మెంట్ల భూగర్భ అంతస్తులు, ఇళ్లలోకి నీరు చేరిన విషయాన్ని తెలుసుకుని అక్కడికి చేరుకుని పరిశీలించారు. సిబ్బందితో కలిసి నీరు సాఫీగా వెళ్లేలా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.స్థానిక కాలనీ అధ్యక్షుడు మల్లారెడ్డితో కలిసి ప్రాంతంలో పర్యటించిన పుష్పనగేష్, ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసు కోవాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. వర్షాకాలం మొత్తం ప్రజలకు అందుబాటులో ఉంటామని, అత్యవసర పరిస్థితుల్లో ఎప్పుడైనా సంప్రదించవచ్చని తెలిపారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సమస్యల పరిష్కారానికి సహకారం అందిస్తామ

---




### రామచంద్రపురంలో

## ఘనంగా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్

**పాల్గొన్న ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి**

**ప్రజా పిలుపు , జూన్ 23, సంగారెడ్డి జిల్లా , రామచంద్రపురం :**

దేశ సమగ్రత, అఖండత కోసం ప్రాణాలర్పించిన అపర దేశభక్తుడు, మహనీయుడు డా. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. డా. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా సంగారెడ్డి జిల్లా రామచంద్రపురంలో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, మాట్లాడారు.. ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానులు, రెండు జెండాలు ఉండటానికి వీల్లేదని (ఏక్ దేశ్ మే దో విధాన్, దో ప్రధాన్, దో నిషాన్ నహీ చలేంగే) కాశ్మీర్ సంపూర్ణ విలీనం కోసం నాడే గళమెత్తి, చివరి శ్వాస వరకు పోరాడిన వీరుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. దేశ సమైక్యత కోసం ఆయన చేసిన ప్రాణత్యాగం వృధా పోలేదని, ఆయన కన్న కలలను నేడు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370 రద్దు ద్వారా సాకారం చేసిందని గుర్తుచేశారు. ముఖర్జీ ఆశయ సాధన, నిరుపమాన దేశభక్తి నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని, దేశ రక్షణ, అఖండత కోసం ఆయన చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ... దేశ ప్రయోజనాలే పరమావధిగా జీవించిన మహోన్నత వ్యక్తి శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని అన్నారు. ఆయన చూపిన బాటలో నడుస్తూ దేశ బలోపేతానికి కార్యకర్తలంతా పునరంకితం కావాలని కోరారు.

---

## డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



**ప్రజా పిలుపు : సంగారెడ్డి, జూన్ 23:**

భారతీయ జనసంఘ వ్యవస్థాపకుడు, గొప్ప జాతీయవాది డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా సంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడంతో పాటు చెట్ల మొక్కలను నాటారు.కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజేశ్వర్ రావు దేశ్ పాండే పాల్గొని డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ దేశానికి చేసిన సేవలను స్మరించారు. దేశ సమగ్రత, జాతీయవాద భావజాలం కోసం ఆయన చేసిన కృషి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఓడెల మాణిక్య రావు, మందుల నాగరాజు, దోమల విజయ్ కుమార్, కాసని వాసు, అమ్రాది ఎల్లయ్య, కొత్తపల్లి జోష్న, అశోక్, శ్రీకాంత్, శివశంకర్, పవన్‌తో పాటు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

---

## నర్సాపూర్ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా రంగకృష్ణ

**శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ మున్సిపల్ చైర్మన్ మురళి యాదవ్**




**ప్రజా పిలుపు : జూన్ 23 , నర్సాపూర్:**

నర్సాపూర్‌లో నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రంగకృష్ణను భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ మురళీధర్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మున్సిపల్ ఉపాధ్యక్షుడు బుచ్చేష్ యాదవ్, మాజీ సర్పంచ్ రమణారావు, కౌన్సిలర్ శ్రీకాంత్ తదితరులు కూడా రంగకృష్ణను కలిసి అభినందనలు తెలియజేశారు.నర్సాపూర్ ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణకు సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షిస్తూ, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని కోరారు.

---

## బాసర ఆలయంలో చోరీ

**బాసర:** నిర్మల్ జిల్లా బాసర జ్ఞాన సరస్వతి నిర్మల్ జిల్లా బాసర జ్ఞాన సరస్వతి ఆలయంలో భారీ చోరీ జరిగింది. సరస్వతి అమ్మవారి ఆలయంలోని పై అంతస్తులో ఉన్న మహంకాళి అమ్మవారి వెండి కిరీటంతో పాటు హుండీని దుండగులు ఎత్తుకెళ్లారు. గర్భగుడి తాళాలు పగులగొట్టి మరీ ఈ దోపిడీకి పాల్పడటం స్థానికంగా కలకలం రేపింది.మంగళవారం తెల్లవారుజామున సుప్రభాత సేవ, పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాస్ గుడికి వచ్చిన సందర్భంగా తాళాలు పగులగొట్టి ఉండటం గుర్తించాడు. వెంటనే ఈ విషయాన్ని ఆలయ భద్రతా సిబ్బందికి సమాచారం అందించారు. ఆలయ భద్రతా సిబ్బంది ఇచ్చిన సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆలయ పూజారి చేత తలుపులు తెరిపించారు. ఆ సమయంలో అమ్మవారికి అలంకరించిన వెండి కిరీటంతో పాటు హుండీని అపహరించినట్లు పోలీసులు గుర్తించారు.

---

## పలు కాలనీలను సందర్శించిన మాద్రి పృథ్వీరాజ్



**ప్రజా పిలుపు : జూన్ 23 పటాన్ చెరు :**

సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షాల కారణంగా పటాన్‌చెరు పట్టణంలోని జేపీ కాలనీ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో పలు ఇళ్లు వరద నీటిలో మునిగిపోయాయి.కాలువలు పొంగి పొర్లడంతో మురుగు నీరు ఇళ్లలోకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.స్థానికుల విజ్ఞప్తి మేరకు మాద్రి పృథ్వీరాజ్ కాలనీలో పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి ప్రజలకు ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా సంబంధిత నీటి సరఫరా, మురుగునీటి శాఖ అధికారిని సంఘటనా స్థలానికి పిలిపించి కాలువల వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు.ప్రజల సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని మాద్రి పృథ్వీరాజ్ తెలిపారు.

---

### నరేంద్ర మోడీ నాయకత్వంలో

## దేశం ప్రగతి పథంలో ముందడుగు

**బీజేపీ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి రామన్ సింగ్**



**ప్రజాపిలుపు, జూన్ 23, నారాయణఖేడ్:**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 12 సంవత్సరాల సుపరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నారాయణఖేడ్ పట్టణంలోని శిశుమందిర్ పాఠశాలలో ఘనంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన బీజేపీ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి రామన్ సింగ్,మాజీ ఎమ్మెల్యే విజయపాల్ రెడ్డి మాట్లాడుతూ,ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ ప్రగతి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వం పేదలు, వెనుకబడిన వర్గాల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందని తెలిపారు.మోడీ ప్రభుత్వ హయాంలో ఓబీసీల అభివృద్ధి,దేశ భద్రత,ఆర్థిక వ్యవస్థ బలోపేతం కోసం తీసుకున్న నిర్ణయాలు చారిత్రాత్మకమని కొనియాడారు.ప్రపంచ దేశాల ముందు భారతదేశ ప్రతిష్టను మరింత పెంచిన నాయకుడు నరేంద్ర మోడీయేనని అన్నారు.ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా నేతలు,కార్యకర్తలు మొక్కలు నాటి సంరక్షించాలని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పత్రి రామకృష్ణ, ఓబీసీ మోర్చా కన్వీనర్ కోణం విఠల్, రజినీకాంత్, మండల అధ్యక్షుడు సిందోల్ దశరథ్, పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్, శంకరంపేట్ అధ్యక్షుడు శ్రావణ్, సుధాకర్, ప్రశాంత్, పట్నం మాణిక్, అశోక్,వెంకటేష్,సాయందర్,కృష్ణ,ప్రవీణ్, పందరి సాయి,నాందేవ్,మాణిక్యం పాల్గొన్నారు.

---

## డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా నివాళులు



**ప్రజా పిలుపు , జూన్ 23 , నర్సాపూర్**

భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా నర్సాపూర్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం నివాళుల కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన దేశ సమైక్యత, జాతీయ సమగ్రత కోసం చేసిన కృషిని స్మరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నర్సాపూర్ వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాపగారి రమేష్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంగసాని సురేష్, జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి, జిల్లా కార్యదర్శి బాదే బాలరాజు, ఓబీసీ మోర్చా నాయకుడు గుండం శంకర్, పట్టణ అధ్యక్షుడు వీరుడు చంద్రయ్య, ప్రధాన కార్యదర్శులు సంఘసాని రాజు, బోర్వెల్ రాంరెడ్డి, సీనియర్ నాయకుడు మన్నె దిగంబర్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగుల గర్జన ప్రభుత్వానికి మంచిది కాదు

### డీఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు డాక్టర్ వివేక్

**ప్రజా పిలుపు : జూన్ 23, సోమాజిగూడ**




రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువత సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే భారీ స్థాయిలో ఉద్యమాలు తప్పవని డీఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు డాక్టర్ వివేక్ హెచ్చరించారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిరుద్యోగ జేఏసీ నాయకులతో కలిసి పాల్గొన్న ఆయన ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వివేక్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలుపై నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో లక్షలాది మంది యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుండగా ప్రభుత్వం సరైన ప్రణాళికతో ముందుకు సాగడం లేదన్నారు. హైదరాబాద్‌ను వెంటనే ఫ్రీ జోన్‌గా ప్రకటించాలని, స్థానిక యువతకు ఉద్యోగాల్లో న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పోలీస్ శాఖలో ఉన్న ఖాళీలను దృష్టిలో ఉంచుకుని కేవలం 5 వేల పోస్టుల నోటిఫికేషన్ సరిపోదని, కనీసం 20 వేల పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం చేస్తున్న జీఓ నెం. 46ను సవరించి, అభ్యర్థుల ప్రయోజనాలను కాపాడేలా నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో పారదర్శకత పాటించి, ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేసి, నియామకాల క్యాలెండర్ ప్రకటించాలని ఆయన కోరారు. నిరుద్యోగ భృతి, ఉద్యోగ నోటిఫికేషన్లు, రిక్రూట్‌మెంట్ ప్రక్రియలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ యువతతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. "నిరుద్యోగుల గర్జన ప్రభుత్వానికి మంచిది కాదు. యువత ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకోవాలి. హామీల అమలులో విఫలమైతే ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటాలను ఉధృతం చేస్తాం. అవసరమైతే ఈ ప్రభుత్వాన్ని ఎలా గద్దె దించాలో మాకు తెలుసు" అని డాక్టర్ వివేక్ స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో నిరుద్యోగ జేఏసీ నాయకులు ఇంద్రా నాయక్, చెర్రీ ప్రవీణ్, ఆకాష్ గౌడ్, నవీన్ పట్నాయక్, శింబు నాయక్, భూక్యా కుమార్, ప్రవీణ్, రాజు, జనార్ధన్, గూగులోతు సూర్య ప్రకాష్, సంతోష్ నిరుద్యోగులు పాల్గొన్నారు.

# భవిష్యత్తుకు సిద్ధమైన నిపుణులను తీర్చిదిద్దుతున్న గీతం ఆంగ్ల విభాగం

### ఆంగ్లంలో బీఏ, ఎంఏ కోర్సులలో చేరడానికి ఈనెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలి

**ప్రజా పిలుపు , జూన్ 23 సంగారెడ్డి :**

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులో గల ఆంగ్ల, ఇతర భాషల విభాగం, ఆంగ్లంలో అందించే యూజీ, పీజీ, పీహెచ్.డీ. కోర్సులలో చేరాలనే ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆ విభాగాధిపతి డాక్టర్ సయంతన్ మోండల్ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు. తమ విభాగం ద్వారా భవిష్యత్తుకు సిద్ధమైన నిపుణులను తీర్చిదిద్దుతున్నట్టు ఆయన వెల్లడించారు. స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీ.ఎస్.హెచ్.ఎస్)లో భాగంగా ఉన్న ఈ విభాగం, మేధోపరమైన పటిమ, సృజనాత్మకత, పరిశోధనా నైపుణ్యాన్ని మేళవించి ఒక ఉత్సాహభరితమైన విద్యా వాతావరణాన్ని అందిస్తోం దన్నారు. ఆంగ్ల విభాగంలో ప్రఖ్యాత జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుంచి విస్తృతమైన బోధన, పరిశోధనా అనుభవం కలిగిన విశిష్ట అధ్యాపకుల బృందం ఉన్నట్టు డాక్టర్ సయంతన్ తెలియజేశారు. వారి నైపుణ్య రంగాలలో ఆంగ్లంలో భారతీయ రచన, ముద్రణ సంస్కృతి, అనువాద అధ్యయనాలు, వలస సాహిత్యం, డిజిటల్ హ్యూమానిటీస్, లింగ, లైంగికత అధ్యయనాలు, అట్టడుగు వర్గాలు, సాహిత్యం, సామాజిక భాషా శాస్త్రం, ఆంగ్ల భాషా విద్య, శైలిశాస్త్రం, ధ్వనిశాస్త్రం వంటివి ఉన్నాయన్నారు. అమెరికన్ సాహిత్యం, బ్రిటిష్ సాహిత్యం, ఆంగ్లంలో భారతీయ రచనలలో బలమైన పునాదిని విద్యార్థులు పొందుతారని డాక్టర్ మోండల్ తెలిపారు. అదే సమయంలో, డిజిటల్ హ్యూమానిటీస్, తులనాత్మక సాహిత్యం, సాంస్కృతిక అధ్యయనాలు, అనువర్తిత భాషాశాస్త్రం, ఆంగ్ల భాషా విద్య వంటి అభివృద్ధి చెందుతున్న విభాగాలను కూడా విద్యార్థులు అన్వేషిస్తారని ఆయన వివరించారు. విద్యానుభవాన్ని సుసంపన్నం చేయడానికి, ఈ విభాగం ప్రఖ్యాత పండితులు, నిపుణులతో కార్యశాలలు, సమావేశాలు, నిపుణుల ఉపన్యాసాలు, జ్ఞాన-భాగస్వామ్య కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తోందన్నారు. ఆంగ్ల విభాగం నుంచి పట్టభద్రులైన వారు విద్య, పరిశోధనా రంగం, సృజనాత్మక రచన, అనువాదం, మీడియా, జర్నలిజం, కంటెంట్, సాంకేతిక రచన, ప్రచురణ, కాపీ ఎడిటింగ్, కార్పొరేట్ కమ్యూనికేషన్, విధాన పరిశోధన సంస్థలలో విభిన్న వృత్తి అవకాశాలను చేపట్టడానికి సన్నద్ధులై ఉంటారన్న ధీమాను ఆయన వ్యక్తపరిచారు. డీన్ ప్రొఫెసర్ రథిన్ రాయ్, డైరెక్టర్ డాక్టర్ శామ్యూల్ థరు, విభాగాధిపతిగా తన నాయత్వంలో ఆంగ్ల, ఇతర భాషల విభాగం పనిచేస్తోందని తెలిపారు. గీతం ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచిన అత్యుత్తమ విద్యార్థులకు మెరిట్ ఆధారిత స్కాలర్ షిప్పులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇతర వివరాల కోసం గీతం వెబ్‌సైట్ www.gitam.eduను సందర్శించాలని, లేదా 87120 18815 / 88849 84000 లను సంప్రదించాలని ఆయన సూచించారు.




# ఇక్రిసాట్ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

### పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి కాలనీ వాసులతో సమావేశం.. క్షేత్రస్థాయిలో పర్యటన

**ప్రజా పిలుపు : జూన్ 23: అమీన్పూర్**

బీరంగూడ డివిజన్ పరిధిలోని ఇక్రిసాట్ ఫేజ్ 1 కాలనీ సమస్యల పరిష్కారానికి ప్రణాళిక బద్ధంగా నిధులు కేటాయించి నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం వివిధ శాఖల అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులతో కలిసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో సమావేశమై.. వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా అంతర్గత సిసి రోడ్లు, నూతన డ్రైనేజీ, మంచినీటి పైప్ లైన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే జిఎంఆర్.. కాలనీ పరిధిలో నూతనంగా అంతర్గత రహదారులు, డ్రైనేజీ పైప్లైన్, మంచినీటి పైపుల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వచ్చే నెల రోజుల్లోగా నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కమ్యూనిటీ హాల్ అంశాన్ని సైతం పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, అమీన్పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, ఈఈ సురేష్, జలమండలి జిఎం శ్రీనివాస్ రెడ్డి, డిఇ వెంకట రమణ, డిజిఎం శివ కుమార్, మాజీ ప్రజా ప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



# బీరంగూడలో నీటిలో మునిగిన నవ్య ప్రైడ్ అపార్ట్మెంట్ సెల్లార్

### సహాయక చర్యలను పర్యవేక్షించిన ఐలాపూర్ మాణిక్ యాదవ్

**ప్రజా పిలుపు , జూన్ 23 , బీరంగూడ:**

రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా బీరంగూడ డివిజన్ పరిధిలోని నవ్య ప్రైడ్ అపార్ట్మెంట్ సెల్లార్ పూర్తిగా వర్షపు నీటితో నిండిపోయింది. సెల్లార్‌లో పార్క్ చేసిన 20కి పైగా ద్విచక్ర వాహనాలు, పలువురు నివాసితుల కార్లు నీటిలో మునిగిపోవడంతో అపార్ట్మెంట్ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు ఐలాపూర్ మాణిక్ యాదవ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. బాధిత అపార్ట్మెంట్ వాసులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి ధైర్యం చెబుతూ అవసరమైన సహాయక చర్యల కోసం తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన మాణిక్ యాదవ్, సెల్లార్‌లో నిల్వ ఉన్న నీటిని వెంటనే తొలగించే చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా డ్రైనేజీ వ్యవస్థలను బలోపేతం చేయడంతో పాటు వర్షపు నీరు నిల్వ కాకుండా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు పలు సూచనలు చేశారు. వర్షాకాలంలో అవసరం లేకపోతే సెల్లార్ ప్రాంతాల్లో వాహనాలను పార్క్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, లోతట్టు ప్రాంతాల్లో నివసించే వారు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ వైర్లు, నీటిలో మునిగిన ఎలక్ట్రిక్ పరికరాలకు దూరంగా ఉండాలని, పిల్లలను నీరు నిలిచిన ప్రాంతాల్లో ఆడనివ్వకూడదని కోరారు. అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని, ప్రజల భద్రతే అందరికీ ముఖ్యమని మాణిక్ యాదవ్ పేర్కొన్నారు. వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ కుటుంబ సభ్యుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.





# సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయాన్ని సందర్శించిన డీఐజీ

**ప్రజా పిలుపు : జూన్ 23 : సంగారెడ్డి :**

జిల్లా పోలీసు కార్యాలయాన్ని మల్టీ జోన్-7 డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి, కార్యాలయ ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం జిల్లా పోలీసు సిబ్బంది, వారి కుటుంబాలకు చెందిన పిల్లల కోసం ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. పోలీసు సిబ్బంది, వారి పిల్లలు పోటీ పరీక్షలకు సిద్ధమై వివిధ రంగాల్లో రాణించేందుకు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాన్ని డీఐజీ అభినందించారు. గ్రంథాలయం ఏర్పాటు చేయడం ద్వారా పోలీసు సిబ్బంది, వారి పిల్లలకు చదువు మరియు పోటీ పరీక్షల సన్నద్ధతలో ఉపయోగకరమైన వనరులు అందుబాటులోకి వస్తాయని డీఐజీ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని లక్ష్యాలను సాధించాలని సూచించారు. తర్వాత జిల్లా పోలీసు కార్యాలయంలోని పలు విభాగాలను డీఐజీ పరిశీలించి, ఆయా శాఖల పనితీరు, రికార్డుల నిర్వహణ, ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించారు. అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో చూపుతున్న కృషిని అభినందించారు. నేరాలు మరియు నేరస్తుల సమాచార నిర్వహణ వ్యవస్థలో కేసుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, సమాచార నాణ్యతను మెరుగుపరచాలని డీఐజీ సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించడం ద్వారా దర్యాప్తు వేగవంతమై, నేర నియంత్రణలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. ప్రజలకు త్వరితగతిన, పారదర్శకంగా సేవలు అందించే దిశగా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డీఐజీ సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి, పోలీసు శాఖ ప్రతిష్ఠను మరింత పెంచేలా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, పరిపాలన అధికారి పద్మావతి, డీఎస్పీలు సత్యయ్య గౌడ్, నరేందర్, కార్యాలయ ఇన్‌స్పెక్టర్లు, రిజర్వు అధికారులు పాల్గొన్నారు.





# శేరిలింగంపల్లి బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న సింధు ఆదర్శ్ రెడ్డి



**ప్రజా పిలుపు : జూన్ 23 :** మియాపూర్‌లోని నరేన్ గార్డెన్స్‌లో నిర్వహించిన శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో భారతీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వి. సింధు ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మాట్లాడుతూ రాబోయే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం అత్యంత ముఖ్యమైనదని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం స్థాయిలో పార్టీ ప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో కొత్త ఓటర్ల నమోదు, అనర్హుల తొలగింపు, నకిలీ ఓట్ల గుర్తింపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం త్వరలో ప్రారంభం కానుందని, ప్రతి పోలింగ్ కేంద్రం నుంచి ఇద్దరు సభ్యులను నియమించి డిజిటల్ విధానంలో సభ్యత్వ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. పార్టీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని సభ్యత్వాన్ని పెంచడంతో పాటు, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో జరిగిన వైఫల్యాలను వివరించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన దివస్ సందర్భంగా ఘన నివాళులు




**ప్రజా పిలుపు , జూన్ 23, అమీన్పూర్**

భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, గొప్ప జాతీయవాది, విద్యావేత్త మరియు దేశ సమైక్యత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన దివస్ కార్యక్రమం బీజేపీ పట్టణ అధ్యక్షుడు బొల్లారం కేజిఆర్ ఆనంద కృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేజిఆర్ ఆనంద కృష్ణ రెడ్డి డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, "ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు ప్రధానులు, రెండు జెండాలు ఉండవు" అనే దృఢ సంకల్పంతో జమ్మూ-కాశ్మీర్ సంపూర్ణ విలీనానికి డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చేసిన పోరాటం భారత చరిత్రలో చిరస్మరణీయమని పేర్కొన్నారు. దేశ సమగ్రత, జాతీయ ఏకత్వం మరియు భారత మాత గౌరవం కోసం ఆయన చేసిన త్యాగం ప్రతి భారతీయుడికి ఆదర్శమని అన్నారు. 1953 జూన్ 23న దేశ సమైక్యత కోసం పోరాడుతూ ఆయన చేసిన ప్రాణత్యాగం భారత జాతి చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిందన్నారు. డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలు, అచంచలమైన దేశభక్తి, నిరుపమానమైన సేవా తత్వం నేటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని కేజిఆర్ ఆనంద కృష్ణ రెడ్డి తెలిపారు. వారి బలిదాన దివస్ సందర్భంగా శతకోటి వందనాలు సమర్పిస్తూ, ఆయన ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు రవీందర్ రెడ్డి, మేఘనా రెడ్డి, శ్రీకాంత్ చారి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు అరుణ్ అంబుజ్ తదితరులు పాల్గొన్నారు.



##### ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై

# అవగాహన, శిక్షణ శిబిరం

**ప్రజా పిలుపు, జూన్ 23, సంగారెడ్డి:**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సంగుపేట చౌరస్తాలోని లక్ష్మీదేవి గార్డెన్‌లో అందోల్ నియోజకవర్గ స్థాయి బూత్ ప్రతినిధులకు అవగాహన, శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి సచిన్ సావంత్, రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయడానికి కృషి చేయాలని సూచించారు. ఓటర్ల జాబితాలో ఉన్న లోపాలను సరిదిద్దేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసు కోవాలన్నారు. ప్రతి పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని కోరారు.



ప్రజాప్రతినిధులు, బూత్ స్థాయి ప్రతినిధులు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్ర మంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమం ముఖ్య ఉద్దేశాలు, లక్ష్యాలను వివరించారు. ఈ సమావేశంలో పార్లమెంట్ సభ్యుడు సురేష్ షెట్కర్, శాసన సభ్యుడు డాక్టర్ సంజీవ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి, కాటా శ్రీనివాస్ గౌడ్‌తో పాటు పలువురు ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# నానాజీపూర్‌లో 'నయాగరా' అందాలు

**కనువిందు చేస్తున్న ఎంటేరు వాగు జలపాతం పర్యాటకులతో కిటకిటలాడుతున్న శంషాబాద్.. ఆంక్షలు విధించిన పోలీసులు**

**ప్రజా పిలుపు : శంషాబాద్, జూన్ 23 :**

సోమవారం అర్ధరాత్రి కురిసిన కుండపోత వర్షాలకు శంషాబాద్ మండలంలోని చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. భారీ వర్షపు నీటితో చెరువులు అలుగులు పారుతుండగా, నానాజీపూర్ సమీపంలోని ఎంటేరు వాగు ఉప్పొంగి ప్రవహిస్తూ 'నయాగరా' జలపాతాన్ని తలపిస్తోంది. రుతుపవనాల ప్రభావంతో కురిసిన భారీ వర్షాల ధాటికి ఎంటేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగు నుంచి జాలువారుతున్న నీటి ప్రవాహం అద్భుత దృశ్యాలను ఆవిష్కరిస్తుండటంతో, ఈ అందాలను తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి సందర్శకులు భారీగా తరలివస్తున్నారు. అయితే, వాగు ఉధృతి ఎక్కువగా ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గుర్తించిన పోలీసులు, పర్యాటకులు వాగు సమీపానికి వెళ్లకుండా





ఆంక్షలు విధించారు. గతంలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు మార్గంలోని కాముని చెరువు సైతం పూర్తిస్థాయిలో నిండి మత్తడి దూకుతోంది. చెరువు నుంచి జాలువారుతున్న నీటి ప్రవాహం స్థానికులను విశేషంగా ఆకట్టుకుంటోంది. గత కొద్ది రోజులుగా ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు ఈ వర్షాలు ఉపశమనాన్ని, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాయి. భారీ వర్షాల నేపథ్యంలో హైడ్రా అధికారులు అప్రమత్తమయ్యారు. కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు, వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు పర్యటించారు. శంషాబాద్--గొల్లపల్లి, తొండుపల్లి--శంకరాపూర్ గ్రామాల మార్గాల్లోని రైల్వే అండర్‌పాస్‌లలో మోకాలి లోతు వరకు వరద నీరు చేరి రాకపోకలకు అంతరాయం కలగగా, హైడ్రా సిబ్బంది వెంటనే స్పందించారు. ప్రత్యేక మోటార్ల సాయంతో నీటిని బయటకు పంపి, రాకపోకలను పునరుద్ధరించారు. వరద పరిస్థితిపై నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

##### ప్రజా సమస్యల పరిష్కారానికి

# కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి

**ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక అమలుపై ప్రత్యేక అధికారిణి డా. క్రిస్టినా జడ్ చోంగ్తు సమీక్ష**

**ప్రజా పిలుపు , జూన్ 23 సంగారెడ్డి**

ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల ద్వారా ప్రజల నుంచి వచ్చిన వినతులు, సమస్యలను సమగ్రంగా విశ్లేషించి వాటి పరిష్కారానికి జిల్లా స్థాయిలో కార్యాచరణ ప్రణాళిక (యాక్షన్ ప్లాన్) రూపొందించాలని జిల్లాకు ప్రత్యేక అధికారిణిగా నియమితులైన ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డా. క్రిస్టినా జడ్ చోంగ్తు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల అమలు, పురోగతిపై ప్రత్యేక అధికారిణి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డా. క్రిస్టినా జడ్ చోంగ్తు మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని జిల్లాలో అన్ని శాఖలు సమన్వయంతో, బాధ్యతాయుతంగా అమలు చేసి విజయవంతం చేసినందుకు జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. ప్రగతి ప్రణాళిక సభల సందర్భంగా ప్రజల నుంచి అందిన వినతులు, సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టిన చర్యలు, శాఖల వారీగా థీమ్ ఆధారంగా అమలు చేసిన కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు చేకూరిన ప్రయోజనాలు, సాధించిన లక్ష్యాలు, ప్రజల నుంచి వచ్చిన స్పందన తదితర అంశాలపై శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వినతుల్లో ఎన్ని పరిష్కరించబడ్డాయి, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి. వాటి పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపట్టవచ్చో సమగ్రంగా విశ్లేషించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమం అమలు సందర్భంగా చేపట్టిన వినూత్న కార్యక్రమాలు (ఇన్నోవేషన్లు) మంచి ఫలితాలు సాధించి ఉంటే వాటిని జిల్లాలో నిరంతరంగా కొనసాగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ప్రత్యేకించి ప్రజల భాగస్వామ్యాన్ని పెంచిన కార్యక్రమాలు, సంక్షేమ పథకాల చేరువను మెరుగుపరిచిన చర్యలు, ప్రజల నుంచి విశేష ఆదరణ పొందిన కార్యక్రమాలను గుర్తించి భవిష్యత్తులో మరింత విస్తృతంగా అమలు



చేయాలని పేర్కొన్నారు. గ్రామ,మండల, నియోజకవర్గ స్థాయిలలో పనిచేసిన అధికారుల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరించి మరింత మెరుగైన కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల సందర్భంగా వివిధ శాఖలకు ప్రజలు చేసిన విజ్ఞప్తులను అధ్యయనం చేసి, వాటిని శాఖల స్థాయిలోనే పరిష్కరించగలమా, ఇతర శాఖల సమన్వయం అవసరమా లేదా ప్రభుత్వ స్థాయి లో ప్రత్యేక చర్యలు అవసరమా అనే అంశాలపై దృష్టి సారించి జిల్లా యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను మూడు విభాగాలుగా వర్గీకరించామని తెలిపారు. శాఖల అధికారులు గుర్తించిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో తీసుకుని పరిష్కరించగల అంశాలపై వెంటనే చర్యలు చేపడుతున్నామని చెప్పారు. మిగిలిన సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయి కార్యాచరణ ప్రణాళికను రూపొందించి చర్యలు తీసుకుంటామని వివరించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభతరం చేయడం, మెరుగైన సౌకర్యాలు అందించడం లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పనిచేస్తోందని కలెక్టర్ పేర్కొ న్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి, అన్ని శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

##### గౌరవ వేతనం ప్రకటించాలని

# లైసెన్స్ సర్వేయర్ల ధర్నా



**ప్రజా పిలుపు, హైదరాబాద్, జూన్ 23**

2025 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు లైసెన్స్ సర్వేయర్లకు గౌరవ వేతనం ప్రకటించకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలంగాణ రెవెన్యూ లైసెన్స్ సర్వే సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నగర రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ నారాయణగూడలోని సర్వే భవన్ వద్ద తెలంగాణ రెవెన్యూ లైసెన్స్ సర్వే సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ నిరసన ధర్నాలో ఆయన మాట్లాడుతూ, సర్వేయర్లకు తగిన పనులు కల్పించకపోవడంతో ఆదాయం లేక జీవనోపాధి దెబ్బతింటోందని అన్నారు. ఈ నేపథ్యంలో సర్వేయర్లకు ఆర్థిక భద్రత కల్పించడం అత్యవసరమని ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం అమలులో ఉన్న రెండేళ్ల లైసెన్స్ విధానం సర్వేయర్లకు నష్టదాయకమని పేర్కొంటూ, దానిని రద్దు చేసి 60 సంవత్సరాల జీవితకాల లైసెన్స్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి రెండు రెవెన్యూ గ్రామాలకు ఒక సర్వేయర్‌ను నియమిస్తే రైతుల భూ సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయని తెలిపారు. సర్వేయర్లను దీర్ఘకాలంగా నిరీక్షణలో ఉంచడం బాధాకరమని, వెంటనే విధుల్లోకి తీసుకుని రైతులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ రంగు శివ, కన్వీనర్ సందీప్, బాలకృష్ణ, నరేష్, సతీష్, దామోదర్, మణి, సరస్వతి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి

**తాండూర్ రూరల్ సర్కిల్, డీఎస్పీ కార్యాలయాలను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా**

**ప్రజా పిలుపు (వికారాబాద్ జిల్లా బ్యూరో): తాండూర్, జూన్ 23:**





వార్షిక తనిఖీల్లో భాగంగా వికారాబాద్ జిల్లా పోలీసు అధికారి (ఎస్పీ) స్నేహ మెహ్రా తాండూర్ రూరల్ సర్కిల్, డీఎస్పీ కార్యాలయాలను మంగళవారం క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యాలయాల పరిశుభ్రత, నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన ఎస్పీ, అనంతరం వివిధ రికార్డులు, కేస్ ఫైళ్లు, పరిపాలనా పత్రాలను తనిఖీ చేసి, రికార్డుల నిర్వహణలో పారదర్శకత పాటించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని సూచిస్తూనే, సిబ్బంది ప్రదర్శించిన క్రమశిక్షణ, చక్కటి టర్నౌట్‌ను ఆమె అభినందించారు. గ్రామీణ పోలీసింగ్‌ను బలోపేతం చేయడానికి 'వి.పి.ఓ' (విలేజ్ పోలీస్ ఆఫీసర్) వ్యవస్థను మరింత ప్రభావవంతంగా మారుస్తామని, అలాగే "సురక్ష మిత్ర" కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రత, డ్రగ్స్ నిర్మూలన, మహిళల రక్షణ, సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కల్పిస్తామని తెలిపారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ చట్ట పరిధిలో త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తాండూర్ డీఎస్పీ నర్సింగ్ యాదయ్య, రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# హత్నూర పోలీస్ స్టేషన్‌లను తనిఖీ చేసిన డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్

**ప్రజా పిలుపు , జూన్ 23, సంగారెడ్డి :**

వార్షిక తనిఖీలలో భాగంగా డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్ మంగళవారం రోజున సంగారెడ్డి మహిళా పోలీస్ స్టేషన్, నేర పరిశోధన విభా గం, హత్నూర పోలీస్ స్టేషన్‌లను సందర్శిం చారు. ఈ సంద ర్భంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌తో కలిసి స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది నివాస గదులు, రికార్డుల నిర్వ హణను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేస్తూ ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించాలని సూచించారు. అదృశ్య కేసులు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్ర పోలీసు శాఖ అందుబాటులోకి తీసుకువచ్చిన నేరాలు--నేర స్థల సమాచార వ్యవస్థ, వినతుల నిర్వహణ వ్యవస్థ, రాష్ట్ర పోలీసు సేవల అనువర్తనం, మానవ వనరుల నిర్వహణ వ్యవస్థలపై పూర్తి అవగాహన పెంపొందించుకొని నేరాల నియంత్రణలో సాంకేతికతను సమర్థంగా వినియోగించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులతో మర్యాదగా వ్యవహరించి, వారి సమస్యలను ఓపికగా విని తగిన పరిష్కారం అంది



స్తామనే నమ్మకం కల్పించాలని డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్ తెలిపారు. ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేసి, సంబంధిత వివరాల ను నిర్ణీత గడువులోగా వ్యవస్థలో నమోదు చేయాలని సూచించారు. స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, అనుమానిత నేరచరిత్ర కలిగిన వ్యక్తుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. పగలు, రాత్రి గస్తీ విధుల్లో భాగం గా అనుమానితుల వేలిముద్రలను పరిశీలించి పాత నేరస్తులను గుర్తించే చర్యలు చేపట్టాలని సూచించారు. సంగారెడ్డి జిల్లా పరిశ్రమలకు కేంద్రంగా ఉండటంతో వివిధ ప్రాంతాల నుంచి ఉపాధి కోసం ప్రజలు వస్తున్నారని, దీంతో ఆర్థిక నేరాలు, ఆస్తి సంబంధిత నేరాలు జరిగే అవకాశాలు అధికంగా ఉంటాయని పేర్కొన్నారు. తనిఖీలలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, సంగారెడ్డి డీఎస్పీ సత్యయ్య గౌడ్, పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్, పోలీస్‌స్టేషన్ల అధికారులు పాల్గొన్నారు.

# రేగోడ్ ప్రభుత్వ హైస్కూల్‌లో మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం



**ప్రజాపిలుపు : మెదక్ :**

రేగోడ్ ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థులు, యువతకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రేగోడ్ ఎస్సై పోచయ్య ఆధ్వ ర్యంలో స్పోర్ట్స్ కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యా ర్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై పోచయ్య మాట్లాడుతూ యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదా ర్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచిం చారు. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబం, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచు కుని మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటమే కాకుండా, ఇతరులకు కూడా అవగాహన కల్పిం చాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల నిర్మూల నకు పోలీసులు కట్టుబడి ఉన్నారని, మత్తు పదా ర్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియో గంపై సమాచారం తెలిసిన వారు 1908 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అలాగే ట్రాఫిక్ నియమాలు, సైబర్ నేరాల నివారణ, వ్యసనాల వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిన్నప్పటి నుంచే ఇలాంటి అంశాలపై అవగాహన పెంపొందిస్తే భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హామీ ఇచ్చారు.. అమలు చేశారు

**ఎస్వీఎస్‌బీ అవతార్ నివాస సముదాయంలో సొంత నిధులతో బోరు ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎంఆర్**

**ప్రజా పిలుపు ,జూన్ 23:** సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ఎస్వీఎస్‌బీ అవతార్ నివాస సముదాయంలో ఇటీవల పర్యటించిన ఎమ్మెల్యే జీఎంఆర్, తాగునీటి సమస్యను గుర్తించి బోరు వేయిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి కేవలం రెండు రోజుల్లోనే సొంత నిధులతో బోరు వేయించి, మంగళవారం సాయంత్రం నివాస సముదాయం వాసుల సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ, హామీలు ఇవ్వడం మాత్రమే కాకుండా వాటిని ఆచరణలో అమలు చేయడం తమ విధానమని తెలిపారు. ప్రభుత్వ నిధులతో పాటు సొంత నిధులను కూడా వినియోగిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నామని పేర్కొన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి వెంటనే స్పందించి సొంత నిధులతో బోరు ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే జీఎంఆర్‌కు నివాస సముదాయం వాసులు కృతజ్ఞతలు



తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు పరమేశ్ యాదవ్, నివాస సముదాయం అధ్యక్షుడు లక్ష్మణ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

##### నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వద్ద

# రూ.3 కోట్ల విలువైన అక్రమ ఆస్తుల గుర్తింపు

**నిజామాబాద్ :** నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కొమ్మూరి మల్లారెడ్డి ఇంటిపై దాడి చేసిన అవినీతి నిరోదక శాఖ అధికారులు సుమారు రూ. 3 కోట్ల విలువైన అక్రమ ఆస్తులున్నట్లు గుర్తించారు. వీటి విలువ మార్కెట్‌లో అనేక రెట్లు అధికంగా ఉంటుందని ఏసీబీ అధికారులు వివరించారు. మంగళవారం నిజామాబాద్‌లోని కార్యాలయంతో పాటు అతడి ఇంటితో పాటు అతడికి సంబంధించిన 10 మంది బంధువులు, బినామీ వ్యక్తులపై ఏకకాలంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాలో నాలుగు నివాసపు ఇండ్లు, ఒక కమర్షియల్ బ్లాక్, 8 ఓపెన్ ప్లాట్లు, 10.23 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు గుర్తించామని వెల్లడించారు.



# ఏపీ కేబినేట్ కీలక నిర్ణయాలకు ఆమోదం

**80కి పైగా అంశాలకు గ్రీన్ సిగ్నల్**

**వివిధ ప్రాంతాల్లో పెట్టుబడులకు పెద్దపీట**

**పరిశ్రమలు, ఐటీ,పర్యాటకం, రాజధాని అభివృద్ధి, డేటా సెంటర్లకు ప్రాధాన్యం**

**రూ.34వేల కోట్ల పెట్టుబడుల స్థాపన ద్వారా 35వేల ఉద్యోగాల కల్పన**

**ఉండవల్లిలో రూ.426 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన**

**జ్యుడిషియల్ అకాడమి నిర్మాణానికి రూ.139 కోట్ల వ్యయం**

**అమరావతిలో ఫైవ్‌స్టార్ హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లకు ప్రోత్సాహకాలు**

**అమరావతి,జూన్23 :**

ఏపీ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన భేటీలో 80కి పైగా అజెండా అంశాలకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వివిధ ప్రాంతాల్లో పెట్టుబడుల స్థాపనకు పెద్దపీట వేస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. పరిశ్రమలు, ఐటీ, పర్యాటకం, రాజధాని అభివృద్ధి, డేటా సెంటర్లు, పునరుత్పాదక ఇంధన రంగానికి సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో తీసుకున్న దాదాపు రూ.34వేల కోట్ల పెట్టుబడుల స్థాపన ద్వారా 35వేల ఉద్యోగాల కల్పన సంబంధించిన నిర్ణయాలకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఉండవల్లిలో రూ.426 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన, ఏపీ జ్యుడిషియల్ అకాడమి నిర్మాణానికి రూ.139 కోట్ల వ్యయంతో పనులు చేపట్టడం తదితర నిర్ణయాలకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. అమరావతిలో ఫైవ్‌స్టార్ హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లకు ప్రోత్సాహకాలు ఇచ్చే ప్రతిపాదనలకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విశాఖ, తిరుపతి, కర్నూలు, అన్నవరం ప్రాంతాల్లోనూ పర్యాటక ప్రాజెక్టులకు క్యాబినెట్ అంగీకారం తెలిపింది. ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, సొసైటీల ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ తీసుకున్న నిర్ణయానికి మంత్రి వర్గం అంగీకారం తెలిపింది. అనంతపురం, కడప జిల్లాల్లో సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులకు భూముల కేటాయింపులు, బయోగ్యాస్ ఎ÷-లాంట్ల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు ఇచ్చే ప్రతిపాదనలకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. అమరావతి ల్యాండ్ పూలింగ్ స్కీమ్ మొదటి, రెండో దశ కోసం సీఆర్డీఏ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లకు సంబంధించి 95 తాత్కాలిక పోస్టుల మంజూరుకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 30 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర కేబినెట్ శుభవార్త చెప్పింది. ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వరంగ సంస్థలు, గురుకుల విద్యాసంస్థలు, సొసైటీ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్ల పెంపునకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే, మెమో-57 ప్రకారం 2004 సంవత్సరానికి ముందు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన సుమారు 11 వేల మంది ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ నుంచి పాత పెన్షన్ విధానం అమలు చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపడంతో ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



### 11వేల మంది ఉద్యోగులకు లబ్ది

**సీపీఎస్ అసోసియేషన్ హర్షం**

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఏపీ సచివాలయ సిపిఎస్ ఉద్యోగుల అసోసియేషన్ స్వాగతించింది. జ.వోనెం.57 అమలుపై సీపీఎస్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. కేబినెట్ నిర్ణయంతో రాష్ట్రంలోని 11 వేల మంది ఉద్యోగులకు లబ్ది చేకూరనుంది. వెటరన్, ఫ్యామిలీ అఖా కంట్రిబ్యూషన్‌పై స్పష్టతనిచ్చిన సర్కార్.. 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న సమస్యకు పరిష్కారం చూపించింది. ఉద్యోగుల గ్రాడ్యుటీ మేరకు ఫ్యామిలీ పెన్షన్ మంజూరుకు నిర్ణయం తీసుకుంది. దీంతో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు అఖా అసోసియేషన్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అఖా అసోసియేషన్ పేర్కొంది. ఏపీ కేబినెట్ సమావేశంలో ఉద్యోగులకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారని ఏపీఎన్‌జీవో అధ్యక్షుడు విద్యాసాగర్ అన్నారు. సీపీఎస్ నుంచి ఓపీఎస్‌లోకి మెమో 57 ప్రకారం 11 వేలమంది ఉద్యోగులకు మేలు జరిగిందన్నారు. ప్రభుత్వరంగ ఉద్యోగుల పదవి విరమణ వయసును 60 నుంచి 62కు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. కేబినెట్ నిర్ణయంతో ఈరోజు ఉద్యోగుల కల నెరవేరిం దన్నారు. అందుకే సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌కు ఉద్యోగులు ధన్య వాదాలు తెలియజేస్తున్నారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ అంశాన్ని సీఎం చంద్రబాబు పరిశీలించాలని విద్యాసాగర్ కోరారు.

# హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2కు గ్రీన్ సిగ్నల్

**కేంద్రమంత్రులతో సిఎం రేవంత్ చర్చలు ఫలప్రదం**

**ఖట్టర్ నివాసంలో కిషన్ రెడ్డితో కలసి భేటీ**

**మెట్రో రైలుపై చర్చల్లో కీలక పురోగతి**

**న్యూఢిల్లీ,జూన్23:**

హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు భవిష్యత్తుకు సంబంధించి అత్యంత కీలకమైన అడుగు పడింది. ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రులతో జరిపిన వరుస సమావేశాలు విజయవంతమయ్యాయి. మెట్రో ఫేజ్-1ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం, అలాగే ఫేజ్-2 విస్తరణ పనుల్లో ఉన్న అన్ని ప్రధాన ఆటంకాలు ఈ చర్చలతో తొలగిపోయాయి. మంగళవారం ఉదయం కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ నివాసంలో దాదాపు 40 నిమిషాల పాటు ఉన్నత స్థాయి సంయుక్త సమావేశం జరిగింది. ఈ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేంద్రమంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, అశ్విని వైష్ణవ్, జి. కిషన్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ సీనియర్ అధికా రులు పాల్గొన్నారు. మెట్రో విస్తరణ, నిధుల సమీ కరణ, కేంద్ర-రాష్ట్ర ఉమ్మడి భాగస్వామ్యంపై ఈ సమావేశంలో అందరూ ఒక ఏకాభిప్రాయానికి వచ్చారు. మెట్రో ప్రాజెక్టును ఆర్థికంగా, సాంకేతి కంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతిష్ఠాత్మక ఆర్థిక సలహా సంస్థను కన్‌స్టలెంట్‌గా ఎంపిక చేశారు. ఈ సంస్థ ప్రధాన అంశాలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక ఇవ్వనుంది. ఎల్ అండ్ టీ సంస్థ నుంచి మెట్రో ఫేజ్-1ను ప్రభుత్వం పూర్తిగా స్వాధీనం చేసుకుంటున్న నేపథ్యంలో.. దానికి సంబంధించిన అప్పులు, ఈక్విటీ విలువ రుణ సేకరణపై రోడ్ మ్యాప్ తయారు చేస్తుంది. ఫేజ్-2 కింద ప్రతిపాదించిన కారిడార్ల నిర్మాణ వ్యయం ఎంత అవుతుంది? నిధుల కోసం ఏయే అంతర్జాతీయ రుణ సంస్థలను ఎంచుకోవాలి? అనే అంశాలపై నివేదిక అందిస్తుంది. ఈ కన్‌స్టలెంట్ సంస్థ ఇచ్చే నివేదిక ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా తదుపరి అడుగులు వేస్తాయి. కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచేందుకు వీలుగా కేంద్ర, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో ఒక ప్రత్యేక సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో కేంద్రప్రభుత్వ ప్రతినిధితో పాటు తెలంగాణ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి సమన్వయ సభ్యులుగా వ్యవహరిస్తారు. కేంద్ర నిబంధనల ప్రకారం డీపీఆర్ లలో మార్పులు చేస్తూ, పనుల అనుమతుల పక్రియను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. ఈ పరిణామంతో హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 విస్తరణకు కేంద్ర ఆమోదం లభించడం సులభతరం కానుంది. ఇది హైదరాబాద్ నగర ట్రాఫిక్ కష్టాలను తీర్చడమే కాక, భవిష్యత్తు ప్రజా రవాణా వ్యవస్థలో ఒక మైలు రాయిగా నిలవనుంది. కేంద్రమంత్రి ఖట్టర్ నివాసంలో దాదాపు 40 నిమిషాల పాటు సాగిన ఈ సమావేశంలో.. హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణపై ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది. మెట్రో ప్రాజెక్టుకు అప్పులు, రెండో ఫేజ్‌కు అనుమతులు, నిధులు కావాలని సీఎం రేవంత్ కోరినట్లు సమాచారం. సమావేశంలో సీఎస్ రామకృష్ణ రావు, మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు. రెండు రోజులుగా సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలోనే ఉన్నారు. కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలతో బిజీబిజీగా గడుపు తున్నారు. ఇప్పటికే ఢిల్లీలో ఉన్న మంత్రి శ్రీధర్ బాబు.. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను కలిశారు.అలాగే, తెలంగాణ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వ రావు ఉదయం ఢిల్లీకి చేరుకున్నారు. మధ్యాహ్నం 1 గంటకు కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద జోషిని ఇరువురు మంత్రులు కలవ నున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యం మొ త్తం కొనుగోలు చేయాలని కోరనున్నారు. అనం తరం కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో సమావేశమై.. యూరియా సరఫరా పెంచాలని మంత్రులు ఉత్తమ్ కుమార్, తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేయనున్నారు.



**పాఠశాలలు, అంగన్‌వాడీలకు**

# నిరంతర నీటి సరఫరా

**స్వచ్ఛ భారత్ మిషలన్ లక్ష్యాలపై కీలక సూచనలు**

**అధికారలుతో అభివృద్ధి, సంక్షేమాలపై మంత్రి సీతక్క సమీక్ష**



**హైదరాబాద్,జూన్23** పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు నిరంతర నీటి సరఫరా ఉండాలని మంత్రి సీతక్క అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యాల సాధనపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. వర్షాకాలంలో తాగునీటి సరఫరాపై మిషన్ భగీరథ అధికారులకు సూచనలు చేశారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలపై మంత్రి సీతక్క రాష్ట్రస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. మంగళవారం జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు, జడ్పీ సీఈవోలు, డీఆర్‌డీఓలు, డీపీఓలతో మంత్రి సమావేశమయ్యారు. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల పురోగతిపై జిల్లాల వారీగా సమీక్ష చేశారు. ఉపాధి హామీ పథకం అమలు, కూలీలకు పనిదినాల కల్పన, పెండింగ్ మెటీరియల్ బిల్లుల చెల్లింపులపై ప్రత్యేక దృష్టి సారించారు. అంగన్‌వాడీ భవనాలు, మహిళా శక్తి భవనాలు, జీపీ కార్యాలయాల నిర్మాణాలపై సమీక్షించారు. జల సంరక్షణ పనులు, చెక్‌డ్యాంల నిర్మాణాలపై అధికారులతో మంత్రి చర్చలు జరిపారు. ప్రధాన మంత్రి కృషి సించాయీ యోజన(పీఎమ్‌కేఎస్‌వై) పనుల అమలుపై మంత్రి సమీక్ష జరిపారు. గ్రామపంచాయతీల పనితీరు, గ్రామ కార్యదర్శుల హాజరుపై సీతక్క ఆరా తీశారు. పారిశుధ్య నిర్వహణ, ఇంటి పన్నుల వసూళ్ల పురోగతిపై చర్చించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులపైనా సమీక్ష చేశారు. గ్రామీణ రహదారుల నిర్మాణం, మరమ్మతులపై పీఆర్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష చేశారు. మహిళా సంఘాల బలోపేతం, బ్యాంక్ లింకేజీల పెంపుపై సెర్ప్‌తో చర్చించారు. మహిళల జీవనోపాధి అవకాశాల విస్తరణకు కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరేలా ప్రతి పథకం అమలు కావాలని ఆదేశాలు జారీ చేశారు. గ్రామీణ తెలంగాణ అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. అలాగే, గ్రామ స్థాయిలో భూగర్భ జలాలు పెంచే విధంగా 'జలసిరి' పోస్టర్లను మంత్రి ఆవిష్కరించారు.

# మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి హౌస్ అరెస్టు

**రైతు ధర్నాకు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు**

**యూరియా యాప్‌ను ఎత్తేయాలన్న వేముల**

**సకాలంలో యూరియా సరఫరా చేయాలని డిమాండ్**

**హైదరాబాద్,జూన్23:**

మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. మంగళవారం ఉదయం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఆయన నివాసానికి వెళ్లిన పోలీసులు నిర్బంధించారు. యూరియా యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా తాడ్వాయి మండలంలో ఎల్లారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జి జాజాల సురేందర్ ఆధ్వర్యంలో వేలాది మంది రైతులు ధర్నా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ ధర్నాలో పాల్గొనేందుకు వేముల ప్రశాంత్ రెడ్డి బయల్దేరగా.. ముందస్తు చర్యల్లో భాగంగా ఆయన్ను పోలీసులు ఇంటి వద్దే నిలువరించారు. రైతులు యూరియా యాప్ వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సకాలంలో యూరియా దొరకడం లేదనే బాధతో నిరసన కార్యక్రమం చేపట్టారని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు. రైతుల పిలుపు మేరకు, ఎల్లారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ సురేందర్ నాయకత్వంలో తామంతా అక్కడికి బయల్దేరాలని నిర్ణయించుకున్నామని, అయితే తనను హైదరాబాద్‌లోనే హౌస్ అరెస్ట్ చేయడం చాలా దుర్మార్గమని ఎమ్మెల్యే వేముల మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటువంటి నియంతృత్వ పాలనతో సాధించేదేమీ ఉండదని ఎమ్మెల్యే వేముల హితవు పలికారు. 'మమ్మల్ని అరెస్ట్ చేసి మా గొంతు నొక్కే బదులు, అక్కడ రైతులకు ఇబ్బందిగా మారిన యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలి అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు అన్-సీజన్‌లోనే దేశంలో ఎక్కడ



యూరియా దొరికినా కొనుగోలు చేసి గోదాముల్లో నిల్వ ఉంచేవారు. రైతులు ఆటో వానికి పైసలు ఇచ్చి పంపిస్తే, నేరుగా పొలాల వద్దకే యూరియా సంచులు వచ్చే పరిస్థితి ఉండేదని , అందుకే రైతన్నలకు ఎలాంటి కొరత లేకుండా యూరియా దొరికిందని గుర్తుచేశారు. ఆ తెలివి ప్రస్తుత ముఖ్యమంత్రికి లేదన్నారు. రైతులకు సరిపడా యూరియాను విరివిగా అందుబాటులో ఉంచాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి అంతా హైదరాబాద్‌లో భూములు ఎక్కడున్నాయి. వాటిని ఏం చేయాలనే దానిపైనే ఉంది తప్ప, రైతుల బాధలపై లేదని ఎమ్మెల్యే వేముల విమర్శించారు. నిన్న మొన్నటి దాకా వడ్ల కొనుగోలు కోసం రైతులను ఏడు చెరువుల నీళ్లు తాగించారని, ఇప్పుడు యూరియా కోసం ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి నిరసన తెలుపుతామంటే, ఎల్లారెడ్డి నియోజకవర్గంలో దాదాపు 300 మంది బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను పొద్దున నుంచి అరెస్ట్ చేసి పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ఇంచార్జ్ సురేందర్ , తాడ్వాయి మండల కేంద్రంలో డీసీఎంఎస్ డైరెక్టర్ కపిల్ రెడ్డిలను అరెస్ట్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని, రోడ్ల మీదికి వస్తున్న రైతులను సైతం వదలకుండా అరెస్ట్ చేస్తున్నారని తెలిపారు. కామారెడ్డి పట్టణంలో బాన్సువాడలో కూడా బీఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారన్నారు. ప్రజా పాలన తెస్తామన్న రేవంత్ రెడ్డి ఇవాళ నియంతృత్వ పాలన సాగిస్తున్నారు. అరెస్టులతో మా గొంతు నొక్కే బదులు యూరియా యాప్ రద్దు చేసి సరిపడా యూరియా రేవంత్ రెడ్డి. రేవంత్ రెడ్డిది ప్రజా పాలనా లేక నియంత పాలనా అనేది తెలంగాణ సమాజం, ప్రజా సంఘాలు ఆలోచించాలి. ఎక్కడో కామారెడ్డి జిల్లాలో నిరసన ఉంటే హైదరాబాద్‌లో మమ్మల్ని అరెస్ట్ చేయడం ఈ ప్రభుత్వం ఎంత నియంతృత్వంగా పనిచేస్తుందో చెప్తోంది. మమ్మల్ని అరెస్ట్ చేసినా రైతుల్లో వచ్చే తిరుగుబాటును మాత్రం ఆపలేరు. రైతులు తప్పకుండా బుద్ధి చెప్తారు'అని ఎమ్మెల్యే వేములహెచ్చరించారు. ఢిల్లీకి 72 సార్లు వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మెట్రో రైలు పైన సమావేశాలు పెట్టడానికి సమయం ఉంటుంది కానీ, కేంద్ర ప్రభుత్వాన్ని యూరియా గురించి అడిగే శ్రద్ధ లేదన్నారు. రేవంత్ రెడ్డికి రైతులంటే చాలా చులకన భావం ఉందని విమర్శించారు. అటు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కూడా రాష్ట్రానికి రావాల్సిన యూరియాను ఒకేసారి ఇవ్వకుండా కోతలు విధిస్తోందని, ఇటు రేవంత్ రెడ్డికి కేంద్రం నుండి తెచ్చుకునే తెలివి లేదని దుయ్యబట్టారు. ప్రతిపక్షాలుగా తాము రైతుల బాధలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తుంటే వినే ఓపిక లేకపోగా, రివర్స్‌లో అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. అటు నరేంద్ర మోదీ, ఇటు రేవంత్ రెడ్డి.. ఈ రెండు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూరియా విషయంలో, వడ్ల కొనుగోలు విషయంలో తెలంగాణ రైతాంగాన్ని నట్టేట ముంచుతున్నాయని ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# కాంగ్రెస్ హామీలపై హరీష్ రావు ఫైర్

### రైతుబంధు, రుణమాఫీపై విమర్శలు
### 'రైతు క్షమాపణ సభ'గా మార్చాలంటూ ఎద్దేవా
### కేసీఆర్ పాలనను గుర్తుచేసిన హరీష్
### 'రైతు ఆశీర్వాద సభ' కాదు.. 'రైతు క్షమాపణ సభ' పెట్టుకోండి

**భద్రాద్రి కొత్తగూడెం,జూన్23:**

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామిని కూడా నెరవేర్చకుండా ప్రజలకు, రైతులకు నమ్మకద్రోహం చేశారని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు మండి పడ్డారు. హామీలు 100 రోజుల్లో నెరవేర్చకపోతే నిలదీయమన్న భట్టి విక్రమార్క మాటలను గుర్తు చేస్తూ.. మరి ఇప్పుడు రండి, మిమ్మల్ని నిలదీస్తాం అని హరీష్ రావు సవాల్ విసిరారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి , డిప్యూటీ సీఎం భట్టి విక్ర మార్కలపై హరీష్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమె త్తారు. మేమిచ్చిన పంటల బోనస్ 3 సార్ల రైతు బంధు కంటే ఎక్కువ అని మంత్రి జూపల్లి కృష్ణారావు అంటుండు. అసలు జూపల్లికి తెలివి ఉందా..? అని మాజీ మంత్రి మండిపడ్డారు. అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. రెండు బోనస్‌లు అయితే ఎగ్గొట్టినవ్.. పోయిన యాసంగి బోనస్ రూ.1200 కోట్లు, ఈ యాసంగి బోనస్ రూ. 1000 కోట్లు ఎగ్గొట్టినవ్ అని సీఎం రేవంత్ రెడ్డిపై ఫైర్ అయ్యారు. అంతగొడితే నువ్వు బోనస్ ఇచ్చింది రూ.2500 కోట్లు.. కానీ మీరు ఎగగొట్టిన రైతు బంధు విలువ రూ.29,350 కోట్లు అని ధ్వజమెత్తారు. జూపల్లి తెలుసుకో లెక్క. చర్చ పెడదామా.. అసెంబ్లీకి వచ్చి మాట్లాడదాం. నువ్వు ఇచ్చిన బోనస కేవలం 3వేల కోట్లు కూడా దాటదు. నువ్వేమైనా తెలిసి మాట్లాడుతున్నవా.. తెలియక మాట్లాడు తున్నవా..? చిన్న మెదడు ఏమైనా చితికిపోయిందా..? నాకైతే అర్థమైతలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాటలకు ఎక్కువ.. చేతలకు తక్కువ. ఆయన దగ్గర మూడు శాఖలున్నాయి. విద్యాశాఖ, హోంశాఖ, మున్సిపల్ శాఖ.. ఈ మూడింటిలో కూడా అట్టర్‌ప్లాప్ అయిండని హరీశ్ రావు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులుండి చేసింది గుండుసున్నా. రేవంత్ రెడ్డి మూడు శాఖలు పెట్టుకుని చేసింది కూడా గుండుసున్నా. విద్యాశాఖ మంత్రిగా ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల నియంత్రణలో రేవంత్ రెడ్డి ఫెయిల్ అయిపోయిండు.. మున్సిపల్ శాఖ, హోంమంత్రిగా ఫెయిల్ అయిండు. కానీ ఒక్క దాంట్లో మాత్రం పాసయ్యిండు. ఢిల్లీకి సంచులు మోసే శాఖలో మాత్రం పాసయ్యిండంటూ ఎద్దేవా చేశారు. సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో చేసిన వ్యాఖ్యలు, ఇచ్చిన హామిలు , వాటిపై ఆయన ఎన్నిసార్లు మాట తప్పారో చూపే ప్రత్యేక వీడియోలను స్క్రీన్‌పై ప్లే చేస్తూ హరీష్ రావు కాంగ్రెస్ తీరును ఎండగట్టారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం రెండు పంటలకు రూ. 10 వేలు చొప్పున రైతుబంధు ఇస్తుంటే, తాము అధికారంలోకి వస్తే మూడు పంటలకు రూ. 15 వేలు ఇస్తామని కాంగ్రెస్ నేతలు నమ్మబలికారని హరీష్ రావు విమర్శించారు. తీరా అధికారంలోకి వచ్చాక ఆ హామిని ఎందుకు అమలు చేయలేదని ఆయన నిలదీశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులను పెండింగ్‌లో పెట్టిందని ఆరోపించారు. కరోనా మహమ్మారి వంటి అత్యంత కఠినమైన ఆర్థిక పరిస్థితుల్లో కూడా ఎక్కడా ఆగకుండా 13 లక్షల రైతు కుటుంబాలకు రూ. 73 వేల కోట్ల రైతుబంధు నిధులను సకాలంలో అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని గుర్తు చేశారు. ఎన్నికల్లో హామీ ఇవ్వకపోయినా ప్రజలకు ఏం కావాలో ముందే గుర్తించి చేసిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. ఇప్పుడు అచ్చంపేట చూసినా, అశ్వారావుపేట చూసినా ప్రజలందరి నోటా 'మళ్లీ కేసీఆర్ రావాలి' అనే మాట ఒక్కటే వినిపిస్తోందని అన్నారు. రెండు లక్షల రైతు రుణమాఫీని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా ఎగ్గొట్టిందని హరీష్ రావు ధ్వజమెత్తారు. భద్రాద్రి రాముడిని సాక్షిగా పెట్టి రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి, చివరకు ఆ దేవుడినే మోసం చేశారని, ఇక ప్రజలను మోసం చేయకుండా ఉంటారా అని ప్రశ్నించారు. త్వరలోనే మధిరలో భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి పాల్గొనే సభకు 'రైతు ఆశీర్వాద సభ' అని పేరు పెట్టడం రైతాంగాన్ని అవమానించడమేనన్నారు.





రైతులను మోసం చేసినందుకు గానూ ఆ సభకు 'రైతు క్షమాపణ సభ'గా నామకరణం చేసుకోవాలని హరీష్ రావు ఎద్దేవా చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని, మార్కెట్‌లో యూరియా దొరకడం లేదని, యాసంగి బోనస్ రెండు సార్లు ఇవ్వాల్సి ఉన్నా అడ్రస్ లేదని హరీష్ రావు విమర్శించారు. వడ్ల కొనుగోళ్లలో క్వింటాకు 5 కేజీల చొప్పున తరుగు తీస్తూ రైతులను నిలువునా ముంచుతున్నారని మండి పడ్డారు. 'అసెంబ్లీలో వడ్లకు తరుగు తీస్తే తోలు తీస్తా అన్న రేవంత్ రెడ్డి.. ఇప్పుడు తరుగు తీస్తున్నా పట్టించుకోకుండా రైస్ మిల్లర్లు, దళారుల చేతుల్లో తోలుబొమ్మగా మారారు' అని ఘాటుగా విమర్శించారు. పెద్దవాగు ప్రాజెక్ట్ కొట్టుకు పోవడానికి పూర్తిగా ఈ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని హరీష్ రావు ఆరోపించారు. ప్రమాద సమయంలో గేట్లు ఎత్తే నాథుడే లేకపోవడం వల్లే ఆ ప్రాజెక్ట్ కొట్టుకుపోయిందన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో కొత్తగా ఒక్క ప్రాజెక్ట్ కూడా కట్టలేదు సరే కదా, ఉన్న ప్రాజెక్టులను కూడా కాపాడుకోలేక కొట్టుకు పోయేలా చేస్తున్నారని మండిపడ్డారు. వ్యవసాయ బావులకు, బోరుబావులకు రైతుల వద్ద 'డిస్కమ్' మీటర్లు పెట్టాలని చూస్తున్నారని, అదే గనుక జరిగితే రైతులకు రోజుకు కేవలం 6 గంటల కరెంట్ మాత్రమే వస్తుందని హెచ్చరించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో 24 గంటల కరెంట్ ఎలా ఉంటుందో, అశ్వారావుపేట గ్రామీణ ప్రాంతాల్లో కూడా అలానే ఉండాలని ఆశించి ఉచిత విద్యుత్ ఇచ్చారని గుర్తు చేశారు. స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఎస్సీ, ఎస్టీలకు ఒక్క కార్పొరేషన్ లోన్ కూడా ఇప్పించలేకపోయారని హరీష్ రావు విమర్శించారు. ఎస్టీ కార్పొరేషన్ ద్వారా ఎంతమంది గిరిజన పిల్లలకు సహాయం అందించారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ప్రశ్నిస్తే.. రూ. 2,750 కోట్లు కేటాయించామని చెప్తున్నారే తప్ప, క్షేత్రస్థాయిలో ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ముమ్మాటికీ గిరిజన వ్యతిరేక ప్రభుత్వమని హరీష్ రావు దుయ్యబట్టారు.

# మా ఇంటి బంగారాన్ని అభినందించిన మెగాస్టార్





స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం విడుదలైన తర్వాత మంచి స్పందనను అందుకుంటోంది. దర్శకుడు రాజ్ నిడిమోరుతో వివాహం అనంతరం సమంత నటించిన తొలి సినిమా కావడంతో ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. జూన్ 19న థియేటర్లలోకి వచ్చిన ఈ చిత్రం పాజిటివ్ టాక్‌తో పాటు బాక్సాఫీస్ వద్ద కూడా మంచి వసూళ్లను నమోదు చేస్తోంది. ఈ నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి చిత్ర బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. సమంత, రాజ్ నిడిమోరు దంపతులతో పాటు దర్శకురాలు నందిని రెడ్డి, చిత్ర యూని ట్ సభ్యులను తన నివాసానికి ఆహ్వానించిన ఆయన, సినిమా విజయంపై శుభాకాంక్షలు తెలిపారు. సినిమా చూసిన అనంతరం చిరంజీవి తన అభిప్రాయాన్ని పంచుకుంటూ, మా ఇంటి బంగారం చాలా ఆసక్తికరంగా అనిపించింది. ఉమ్మడి కుటుంబం నేపథ్యంలో యాక్షన్, భావోద్వేగాలను అందంగా మేళవిస్తూ దర్శకురాలు నందిని రెడ్డి తనదైన శైలిలో వినోదాత్మకంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు అని పేర్కొన్నారు. అలాగే సమంత నటనను ప్రత్యేకంగా ప్రశంసించిన ఆయన, సమంత నటన అద్భుతంగా ఉంది. ముఖ్యంగా చీరకట్టులో ఆమె చేసిన యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇటువంటి మహిళా ప్రాధాన్య చిత్రాలు తెలుగు సినీ పరిశ్రమకు అవసరం. ఈ విజయానికి సమంత, నందిని రెడ్డి, రాజ్ మరియు మొత్తం చిత్ర బృందానికి హృదయపూర్వక అభినందనలు అని తెలిపారు. మరోవైపు జీవితంలో కొత్త అధ్యాయాన్ని ఆహ్వానిస్తున్న సమంత, రాజ్ దంపతులకు ప్రత్యేక అభినందనలు అని ఆయన పేర్కొన్నారు. చిరంజీవి సతీమణి సురేఖ సమంత దంపతులకు కొత్త బట్టలు పెట్టి ఆశీర్వదించారు. ఈ కామెంట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారితీసింది. ముఖ్యంగా 'కొత్త అధ్యాయం' అనే పదం అభిమానుల దృష్టిని ఆకర్షించింది. దీనిపై సోషల్ మీడియాలో పలు ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. సమంత ప్రగ్నెన్సీ విషయంలో చిరు ఈ కామెంట్ చేశారా అని పలువురు ముచ్చటించుకుంటున్నారు. ఇక జూన్ 19న విడుదలైన 'మా ఇంటి బంగారం' మొదటి రోజునుంచే ప్రేక్షకుల నుంచి మంచి స్పందనను అందుకుంది. ముఖ్యంగా సమంత నటన, భావోద్వేగ సన్నివేశాలు, కుటుంబ నేపథ్యం, యాక్షన్ ఎలిమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

# వరుస సినిమాలతో ప్రభాస్ బిజీ

ఇండియన్ సినిమా బిగ్గెస్ట్ సూపర్ స్టార్‌గా గుర్తింపు పొందిన ప్రభాస్ ప్రస్తుతం వరుస పాన్ ఇండియా ప్రాజెక్టలతో బిజీగా ఉన్నాడు. 'బాహుబలి' తర్వాత ఆయన క్రేజ్ ప్రపంచవ్యాప్తంగా విస్తరించగా, ప్రతి సినిమా మీద అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొంటున్నాయి. అయితే ఈ ఏడాది విడుదలైన 'రాజా సాబ్' సినిమా మాత్రం అభిమానులు ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయింది. భారీ అంచనాల మధ్య వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచింది. ఇదిలా ఉంటే, దర్శకుడు హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ'పై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. మొదట ఈ చిత్రాన్ని 2026 చివర్లో విడుదల చేయాలని భావించి నప్పటికీ, ప్రస్తుతం ఈ సినిమా విడుదల వాయిదా పడే అవకాశాలు కనిపి స్తున్నాయి. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం 'ఫౌజీ' 2027లో విడుదలయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని టాక్ వినిపిస్తోంది. అయితే ఇదే ఇప్పుడు ప్రభాస్ అభిమానులకు మరింత ఆనం దాన్ని కలిగిస్తోంది. ఎందుకంటే 2027లో ప్రభాస్ నుంచి ఏకంగా మూడు భారీ ప్రాజెక్టులు ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అందులో మొదటిగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించనున్న 'స్పిరిట్' ఉంది. ఈ చిత్రంలో ప్రభాస్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నాడనే ప్రచారం ఇప్పటికే అభిమానుల్లో ఆసక్తిని పెంచింది. మరోవైపు 'బాహుబలి' ప్రపంచాన్ని మరోసారి తెరపైకి తీసుకొచ్చే యానిమేషన్ చిత్రం 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' కూడా 2027లో విడుదల కానున్నట్లు తెలుస్తోంది. 'బాహుబలి' ఫ్రాంచైజీకి ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రేజ్ దృష్ట్యా ఈ ప్రాజెక్ట్‌పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. అదే సమయంలో 'ఫౌజీ' కూడా అదే ఏడాదిలో విడుదలైతే, ప్రభాస్ అభిమానులకు ఒకే ఏడాదిలో మూడు భారీ ట్రీట్స్ లభించినట్లవుతుంది. దీంతో 2027ను ఇప్పటికే అభిమానులు 'ప్రభాస్ నామ సంవత్సరం'గా అభివర్ణిస్తున్నారు. భిన్నమైన కథలు, భారీ స్థాయి నిర్మాణ విలువలు, పాన్ ఇండియా మార్కెట్‌లో ప్రభాస్‌కు ఉన్న క్రేజ్ దృష్ట్యా ఈ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తాయనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా 'స్పిరిట్', 'ఫౌజీ', 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' చిత్రాలు ఒకే ఏడాదిలో విడుదలైతే భారతీయ సినీ పరిశ్రమలోనే అరుదైన రికార్డులు నమోదయ్యే అవకాశం ఉందని



సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పుడు అభిమానుల దృష్టి మొత్తం ఈ ప్రాజెక్ట్‌ల అధికారిక విడుదల తేదీలపైనే ఉంది.

# వారసత్వం ఉన్నా...కష్టపడితేనే ఫలితం

### ప్రేక్షకులు ఊరికే ఆదరిస్తానుకోరాదు
### నటుడు రామ్ చరణ్

సినిమా నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చినప్పటికీ.. ప్రేక్షకులు ఎప్పుడూ నటుడి నటను చూసే ఆదరిస్తారని రామ్ చరణ్ అన్నారు. తాజాగా ఆయన 'రిపబ్లిక్ సమ్మిట్'లో పాల్గొని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. బిజినెస్ భాషలో చెప్పాలంటే.. 'పెద్ది' సినిమా తన కెరీర్‌కు బెస్ట్ 'స్టార్టప్' లాంటిదని వెల్లడించారు. నా చిన్నప్పుడు దర్శకులు, నిర్మాతలు 'మీ నాన్న కంటే బాగా చేయాలి' అని చెప్పినప్పుడు బాధ్యతగా అనిపించేది. నేను ఆ ఒత్తిడిని పెద్దగా పట్టించుకోలేదు. మా నాన్న ఇంట్లో సరదాగా ఉంటారు. మా డైనింగ్ టేబుల్ మీద సినిమా చర్చలు, స్టార్డమ్ ముచ్చట్లు ఎప్పుడూ రానిచ్చేవారు కాదు. సినిమా నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి రావడం వల్ల త్వరగా ఒక మంచి వేదిక దొరుకుతుందనేది నిజమే.. కానీ, ప్రేక్షకులు మనల్ని ఎవరి వారసుడు అని చూడరు.. మొదటి సినిమా తర్వాత కేవలం మన కష్టం, నిజాయతీ మాత్రమే చూస్తారు. నా 15 ఏళ్ల కెరీర్‌లో ఆయన నాకు ఎప్పుడూ నటన పరంగా ఫీడ్‌బ్యాక్ ఇవ్వలేదు. నన్ను వేలు పట్టి నడిపించలేదు. కానీ క్రమశిక్షణ విషయంలో ఆయనే నాకు స్ఫూర్తి అని చెప్పారు. ఓటీటీల ట్రెండ్ గురించి మాట్లాడుతూ.. థియేటర్లు, ఓటీటీలు రెండూ ఒకదానికొకటి సాయం చేసుకుంటూ ముందుకు సాగాలి. 'ఆర్ఆర్ఆర్' థియేటర్లలో విడుదలైన తర్వాత నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులోకి వచ్చింది. దానివల్ల పాశ్చాత్య దేశాల ప్రజలకు కూడా సినిమా చేరి, ఆస్కార్ నామినేషన్ వరకు వెళ్లేలా క్రేజ్ పెరిగింది. భారతదేశంలో ఇప్పటికీ ఒక కుటుంబానికి అత్యంత తక్కువ ఖర్చుతో దొరికే వినోదం సినిమానే. థియేటర్లలో పాప్‌కార్న్ ధరలు కాస్త తగ్గితే ఇంకా బాగుంటుంది. సినిమా అనేది ఓ భావోద్వేగం.. అది ఎప్పటికీ అలానే ఉంటుంది. దేశభక్తి కథలకు ఎప్పుడూ ప్రాధాన్యతనివ్వాలి. ఒక సినిమా రూ.500 కోట్లు లేదా రూ.800 కోట్లు వసూలు చేస్తోందంటే, దానర్థం దేశంలోని ప్రజలు ఆ కథను తమ సొంత కథగా భావించి ఆదరిస్తున్నారనే. దేశాన్ని ఏకం చేసే ఇలాంటి సినిమాలు రావడం గొప్ప విషయం' అని రామ్ చరణ్ తెలిపారు.



## హైదరాబాద్ మెట్రో రెండో దశ

# ప్రగతి పరుగులా? రాజకీయ చదరంగమా?



డా. సూర్యదేవర రామకృష్ణ
9490754169

**హైదరాబాద్** మహానగర ప్రజా రవాణా వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన మెట్రో రైలు, ఇవాళ కేవలం నగర అభివృద్ధి చిహ్నంగా మాత్రమే కాకుండా రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత వేడెక్కిన రాజకీయ చర్చనీయాంశంగా మారింది. నాగోల్ నుంచి రాయదుర్గం వరకు నిత్యం లక్షలాది మంది ప్రయాణికులతో పరుగులు తీస్తున్న మెట్రో రైళ్లు నగర జీవనాన్ని ఎంతగానో సులభతరం చేశాయి. కానీ, నగరం నలువైపులా విస్తరించాల్సిన రెండో దశ మాత్రం ఏళ్ల తరబడి కాగితాలకే పరిమితమైపోయింది. ఈ ఆలస్యం వెనుక ఉన్న అసలు కారణాలు ఏమిటి? రాష్ట్ర ప్రభుత్వానికీ కేంద్రానికీ మధ్య ఎందుకు పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది? ఈ అంశాన్ని లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### మెట్రో విస్తరణ సమస్య ఏమిటి?:

హైదరాబాద్ మెట్రో మొదటి దశను ఎల్ అండ్ టీ సంస్థ నిర్మించి, నిర్వహించింది. అయితే ఆ సంస్థకు ఈ భారీ ప్రాజెక్టు కాలక్రమేణా ఆర్థికంగా పెద్ద భారంగా మారింది. ఈ నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రాజెక్టును పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకునే ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. భారతీయ రిజర్వ్ బ్యాంకు హామీతో ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి సుమారు 13,600 కోట్ల రూపాయల రుణాన్ని కేవలం 4 శాతం తక్కువ వడ్డీకే, 20 ఏళ్ల సుదీర్ఘ కాలపరిమితితో సమీకరించారు. దాదాపు 30,000 కోట్ల రూపాయల విలువైన ఈ ప్రాజెక్టును సగం ధరకే రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోకి తీసుకువచ్చినట్టు అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. మే నెల మొదటి తేదీ నుంచే మెట్రో ఫేజ్-1 పూర్తిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చింది. అయితే, అసలు సమస్య ఇక్కడే మొదలవుతుంది. ఈ టేకోవర్ ప్రక్రియ పూర్తయితేనే రెండో దశ విస్తరణకు మార్గం సుగమం అవుతుందని అందరూ భావించారు. నాగోల్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు 76 కిలోమీటర్లకు పైగా, మొత్తం 122 కిలోమీటర్ల కొత్త కారిడార్లతో రూపొందించిన రెండో దశ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకూ తుది ఆమోదం లభించలేదు. రాష్ట్ర ప్రభుత్వం దీనికోసం 19,579 కోట్ల రూపాయలతో పరిపాలనా అనుమతి ఇచ్చినప్పటికీ, కేంద్రం తన వాటాగా ఇవ్వాల్సిన నిధులు, పూచీకత్తు, రుణ సమీకరణకు అవసరమైన సహకారం ఇంకా కార్యరూపం దాల్చలేదు. ఈ జాప్యం వల్ల ప్రాజెక్టు అంచనా వ్యయం రాబోయే రోజుల్లో మరింత పెరిగే ప్రమాదం ఉందని మౌలిక సదుపాయాల నిపుణులు హెచ్చరిస్తున్నారు. మొదటి దశలో అత్యధిక డిమాండ్ ఉన్న పలు కీలక మార్గాలకు మెట్రో కనెక్టివిటీ లేకపోవడం, నగర శివారు ప్రాంతాలు మెట్రో పరిధికి దూరంగా ఉండటం వంటి లోపాలను సామాన్య ప్రజలు ఇప్పటికీ ఎదుర్కొంటూనే ఉన్నారు.

### రేవంత్ సర్కారు, కేంద్రం మధ్య పేచీ ఏమిటి?:

మెట్రో రెండో దశ నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పదే పదే కేంద్రాన్ని కోరుతున్నా ఆశించిన స్పందన రాకపోవడంతో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేరుగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై తీవ్ర ఆరోపణలకు దిగారు. జపాన్ నుంచి ఐఆర్ఎఫ్‌సీ ఖాతాలోకి వచ్చిన నిధులను తెలంగాణకు అందకుండా కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారని, రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ కక్షసాధింపే ఆయన ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోందని సీఎం బహిరంగంగా విమర్శించారు. తెలంగాణ నుంచి కేంద్ర మంత్రివర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్న వ్యక్తికి రాష్ట్ర ప్రయోజనాలపై బాధ్యత ఉండాలని, కానీ కిషన్ రెడ్డి అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని ఆయన నిలదీశారు. తాము అన్ని ఆర్థిక ఏర్పాట్లు పూర్తి చేసి, డాక్యుమెంట్ ఫీజు చెల్లించి, ఈక్విటీ కింద నిధులు జమ చేసినా కేంద్రం నుంచి తుది అనుమతి రాకపోవడం వెనుక ఉద్దేశపూర్వక జాప్యమే కారణమని ఆరోపించారు. దీనికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అంతే ఘాటుగా బదులిచ్చారు. తాను రుణాన్ని అడ్డుకోవాల్సిన అవసరం ఏముందని ఎదురుప్రశ్నించిన ఆయన, దేశంలోని అన్ని రాష్ట్రాలకు వర్తించే నిబంధనలే తెలంగాణకూ వర్తిస్తాయని, కొన్ని సాంకేతిక అంశాలపై అధ్యయనం కొనసాగుతోందని వివరణ ఇచ్చారు. మెట్రో రెండో దశకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 50 శాతం చొప్పున నిధులు సమకూర్చే ప్రతిపాదనకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపినట్టు ఆయన పేర్కొన్నారు. డీపీఆర్, ఇతర సాంకేతిక వివరాలు పూర్తయిన తర్వాతే తుది నిర్ణయం సాధ్యమని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి సైతం స్పష్టం చేశారు. తమపై వివక్ష చూపిస్తున్నారన్న ఆరోపణలను తోసిపుచ్చిన కిషన్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కేంద్రంపై నిందలు మోపడం సరికాదని ఎదురుదాడి చేశారు.

### వేరు వేరుగా ఎవరెవరిపై విమర్శలు?:

ఈ వివాదం కేవలం రాష్ట్రం వర్సెస్ కేంద్రం మాత్రమే కాదు. ఇందులో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుమారుడు కేటీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ పార్టీ కూడా భాగమై, వ్యవహారం త్రిముఖ పోరుగా మారింది. మొదటి దశలో అత్యధిక డిమాండ్ ఉన్న మార్గాలకు బదులు లాభదాయకత తక్కువగా ఉన్న మార్గాలను ఎంచుకుని పాత ప్రభుత్వమే ప్రాజెక్టును నష్టాల్లోకి నెట్టిందని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తుండగా, తమ హయాంలో దేశంలోనే అత్యుత్తమ మెట్రో వ్యవస్థల్లో ఒకటిగా హైదరాబాద్ మెట్రోను నిలిపామని బీఆర్ఎస్ నేతలు ప్రతివాదన చేస్తున్నారు. మరోవైపు, కేటీఆర్ కుట్రలకు కిషన్ రెడ్డి వంత పాడుతున్నారని, కేంద్రమంత్రికి అంత చాతుర్యం లేదని కేటీఆర్ ఆడించినట్టు ఆడుతున్నారని సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా మరింత దుమారం రేపాయి. దీనికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సైతం ఘాటుగా స్పందిస్తూ, తనను భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణలకు దిగడంతో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది.

### వీటిలో నిజమెంత? :

ఈ వివాదంలో రెండు పక్షాల వాదనలనూ నిష్పక్షపాతంగా బేరీజు వేసుకుంటే కొన్ని వాస్తవాలు స్పష్టంగా కనిపిస్తాయి. మొదటిది- మెట్రో రెండో దశకు సంబంధించిన డీపీఆర్‌కు కేంద్రం నుంచి తుది ఆమోదం నిజంగానే ఆలస్యమవుతోంది అన్నది వివాదాస్పదం కాని వాస్తవం. ఈ జాప్యానికి కారణం ఏమిటన్న దగ్గరే అభిప్రాయభేదాలు మొదలవుతాయి. మొదటి దశను ప్రైవేటు సంస్థ నిర్వహించడం, రెండో దశను రాష్ట్ర ప్రభుత్వమే చేపట్టాలని



నిర్ణయించడం వల్ల రెండింటి మధ్య సమన్వయ లోపం తలెత్తే అవకాశం ఉందన్న కేంద్రం వాదనలో సాంకేతికంగా కొంత న్యాయం ఉండే అవకాశం ఉంది. మెట్రో వంటి భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు డీపీఆర్ పరిశీలన సాధారణంగా నెలల తరబడి సాగడం దేశవ్యాప్తంగా చూసే అంశమే. అయితే, కేంద్రం ప్రకటించిన యాభై శాతం నిధుల భాగస్వామ్య ప్రతిపాదన కేవలం మౌఖిక హామీగానే మిగిలిపోయి, లిఖితపూర్వక, కార్యాచరణ రూపంలో ముందుకు రాకపోవడం రాష్ట్ర ప్రభుత్వ ఫిర్యాదుకు బలాన్నిస్తుంది. రాజకీయంగా రెండు పార్టీలదీ వేర్వేరు ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పుడు, కేంద్ర-రాష్ట్ర సంబంధాలలో సహజంగా తలెత్తే అపనమ్మకం, జాప్యానికి ఆజ్యం పోస్తుందన్నది మాత్రం కాదనలేని వాస్తవం. తెలంగాణ మాత్రమే కాదు, వేరే రాష్ట్రాల్లో సైతం ప్రతిపక్ష పాలిత ప్రభుత్వాలకు కేంద్ర సహకారం ఆలస్యమైన ఉదంతాలు గతంలో నమోదయ్యాయి. కాబట్టి ఇది తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైన వివక్ష అని కచ్చితంగా చెప్పలేకపోయినా, రాజకీయ కారణాలు పూర్తిగా లేవని కొట్టిపారేయడం కూడా సాధ్యం కాదు. మరోవైపు, రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి చూస్తే ఎల్ అండ్ టీ నుంచి టేకోవర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసి, తక్కువ వడ్డీకి భారీ రుణం సమీకరించగలగడం నిర్వహణ సామర్థ్యానికి నిదర్శనమే అయినప్పటికీ, ఈ విజయాన్ని కేంద్రంపై ఒత్తిడి తెచ్చే రాజకీయ సాధనంగా వాడుకుంటోందన్న విమర్శనూ తోసిపుచ్చలేం. ప్రతి మీడియా సమావేశంలోనూ మెట్రో అంశాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తూ, వ్యక్తిగత విమర్శలకు దిగడం పరిష్కారం కంటే రాజకీయ లబ్ధికే ఎక్కువ ఉపయోగపడుతుందన్న వాదనకూ తావుంది. అదే సమయంలో, ఎన్నికల హామీల అమలులో జాప్యంపై కేంద్రమంత్రి చేసిన ఎదురుదాడి సహేతుకమే అయినా, అది మెట్రో నిధుల ఆలస్యానికి సంబంధించిన ప్రశ్నకు ప్రత్యక్ష సమాధానం కాదు- ఇది అంశాన్ని పక్కదారి పట్టించే ధోరణిగానే కనిపిస్తుంది. మొత్తంగా చూస్తే, ఇరు పక్షాల ఆరోపణల్లోనూ పాక్షిక సత్యం ఉంది తప్ప, ఏ ఒక్క పక్షమూ పూర్తిగా నిర్దోషి కాదు. సాంకేతిక జాప్యం, రాజకీయ వైరం రెండూ కలగలసిపోయి అసలు సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి.

### ముందున్న మార్గం:

చివరిగా చెప్పాలంటే, ఈ రాజకీయ వాగ్యుద్ధంలో అసలు నష్టపోతున్నది మాత్రం ప్రతిరోజూ లక్షలాది మంది మెట్రోపై ఆధారపడే సామాన్య ప్రయాణికులే. ట్రాఫిక్ రద్దీతో సతమతమవుతున్న నగర శివారు ప్రాంతాల ప్రజలు రెండో దశ కోసం ఎదురుచూస్తుండగా, రాజకీయ పార్టీలు పరస్పర నిందారోపణలతో కాలం వెళ్లదీయడం ఆందోళనకరం. డీపీఆర్ ఆమోదం, నిధుల విడుదల వంటి సాంకేతిక ప్రక్రియలను వేగవంతం చేస్తూనే, రాజకీయ విభేదాలను పక్కనపెట్టి అభివృద్ధి అంశాల్లో పరస్పర సహకారం అందించుకోవడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉన్న ఏకైక మార్గం. లేదంటే, నగర ప్రజల కల అయిన పూర్తిస్థాయి మెట్రో నెట్‌వర్క్ మరికొన్నేళ్లు ఆలస్యమయ్యే ప్రమాదం ఉంది. ఇరు పక్షాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన సమయం ఇది.

---

# సామాన్యుడి ప్రశ్న పైనే ఎందుకు అసహనం?



గంట సోమన్న
సీనియర్ జర్నలిస్ట్.

**ప్రజాస్వామ్యం** అంటే ప్రజల చేత,ప్రజల కోసం,ప్రజల పాలన అని మనం గొప్పగా చెప్పుకుంటాం.పాఠశాల గోడల మీద,రాజ్యాంగ పీఠికలో,నాయకుల ఉపన్యాసాల్లో ఈ మాట వినిపిస్తూనే ఉంటుంది. కానీ,ఆచరణలోకి వచ్చేసరికి ఆ నిర్వచనం రంగు వెలిసిపోతున్నది. అధికారంలో ఉన్న నాయకుడు నోరుజారితే అది 'వ్యూహం' అవుతుంది.ప్రతిపక్ష నాయకుడు ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తే అది 'రాజకీయం' అవుతుంది. కానీ,పన్నులు కట్టి,రోడ్డు మీద గుంతలు పూడ్చమని అడిగే సామాన్యుడి ప్రశ్న మాత్రం 'కుట్ర'గా, 'వ్యక్తిగత దాడి'గా చిత్రీకరించబడుతుంది.ఈ విచిత్ర వైఖరే నేడు ప్రజాస్వామ్యాన్ని తొలిచేస్తున్న చెదపురుగు. అసలు అధికారానికి సామాన్యుని ప్రశ్న ఎందుకు నచ్చదు? ఎందుకంటే ప్రతి ప్రశ్న జవాబుదారీతనాన్ని కోరుతుంది.జవాబుదారీతనం అధికార సౌలభ్యానికి అడ్డుగోడ అవుతుంది. అందుకే అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా మాట్లాడే ద్వంద్వ సంస్కృతి రాజకీయాల్లో బలంగా వేళ్లూనుకుంది.గద్దె దిగిన నాడు 'ప్రజల గొంతు వినాలి' అని చెప్పే నాయకుడే,గద్దెనెక్కిన మరుక్షణం అదే గొంతును 'అభివృద్ధి నిరోధక స్వరం' అని ముద్ర వేస్తాడు. ఇక్కడ మారింది వ్యక్తులు కాదు, అధికారం

**ప్రశ్నించడం దేశద్రోహం కాదు.విమర్శించడం ప్రభుత్వాన్ని కూల్చడం కాదు.అవి ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు వంటివి. సమాజంలో ప్రశ్న చచ్చి పోయిన రోజున అవినీతి వ్యవస్థీకృతమవుతుంది. నిలదీసే గొంతు మూగబోయిన రోజున అధికారం నిరంకుశంగా మారుతుంది.**

ఇచ్చే మత్తు.ఈ అసహనానికి మరో కారణం భక్తి రాజకీయం. నాయకుడిని దేవుడిగా, పార్టీని మతంగా చూసే ధోరణి పెరిగాక,విమర్శను పాపంగా భావిస్తున్నారు. సోషల్ మీడియాలో ఒక పౌరుడు పథకంలోని లోపాన్ని ఎత్తిచూపితే, నిమిషాల్లో అతని కులం, మతం,ప్రాంతం, అతను ఏ పార్టీకి ఓటు వేశాడో తవ్వి తీస్తారు. కానీ,అతను లేవనెత్తిన అంశంపై మాత్రం చర్చ ఉండదు.ప్రశ్నను చంపేసి ప్రశ్నించినవాడిని దోషిగా నిలబెట్టడం నేటి ఫార్ములా అయిపోయింది. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధం.నిజానికి ప్రశ్నించడం దేశద్రోహం కాదు.విమర్శించడం ప్రభుత్వాన్ని కూల్చడం కాదు.అవి ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు వంటివి. సమాజంలో ప్రశ్న చచ్చి పోయిన రోజున అవినీతి వ్యవస్థీకృతమవుతుంది. నిలదీసే గొంతు మూగబోయిన రోజున అధికారం నిరంకుశంగా మారుతుంది. పాలకుడికి అద్దంలో తన ముఖం తప్ప ప్రజల ముఖాలు కనిపించవు. అందుకే పూర్వం రాజుల దగ్గర కూడా విదూషకులు ఉండేవారు. రాజు తప్పును హాస్యంగా ఎత్తిచూపి, ఆత్మవిమర్శ చేసుకునే అవకాశం ఇచ్చేవారు.కానీ, నేడు ఒక సామాన్యుడు ఫేస్‌బుక్ పోస్టు పెడితే పరువునష్టం కేసు,ఆర్టీఐ వేస్తే బెదిరింపు కాల్స్,గ్రామ సభలో లెక్క అడిగితే ఊరి పెద్దల ఆగ్రహం.చట్టం రక్షణ కవచం కాకుండా ప్రశ్న మీద ప్రయోగించే ఆయుధంగా మారిపోయింది.ప్రభుత్వాలు శాశ్వతం కావు.ప్రతిపక్షాలూ శాశ్వతం కావు.ఎన్నికల్లో గెలుపోటములు సహజం. కానీ,శాశ్వతంగా ఉండేది ప్రజలు మాత్రమే.వారి హక్కులు,వారి ప్రశ్నలు,వారి ఆకాంక్షలు మాత్రమే. ఒక వ్యవస్థ ఆరోగ్యంగా ఉందనడానికి గీటురాయి పాలకుల ప్రసంగాలు కాదు, పాలితులు ఎంత స్వేచ్ఛగా ప్రశ్నించగలుగుతున్నారన్నదే.ప్రశంస ఒక్కసారి బలాన్ని ఇస్తుంది,కానీ,ప్రశ్న ప్రతిసారి దారి తప్పకుండా




కాపాడుతుంది.కాబట్టి పాలకులు విమర్శను వినే సంస్కృతిని పెంచుకోవాలి. ప్రతి శాఖలో ప్రజా వినతులకు నిర్ణీత గడువులో సమాధానం ఇచ్చే విధానం రావాలి. విమర్శ చేసినవాడి ఉద్దేశం వెతకడం మాని,విమర్శలోని నిజాన్ని వెతకాలి. ప్రతిపక్షాలు అధికారంలోకి వచ్చాక తాము నినదించిన పారదర్శకతను తామే పాటించాలి. ఇక పౌరులుగా మన బాధ్యత కూడా ఉంది. వాట్సాప్‌లో వచ్చిన ప్రతి మెసేజ్‌ను గుడ్డిగా నమ్మకుండా,ఆధారాలతో ప్రశ్నించడం నేర్చుకోవాలి. వ్యక్తిగత దూషణ కాకుండా విధానపరమైన విమర్శకు పదును పెట్టాలి. చివరిగా ఒక్కమాట...ప్రజాస్వామ్యం అనేది ఐదేళ్లకోసారి వచ్చే పండుగ కాదు.అది ప్రతి రోజూ కాపాడుకోవాల్సిన విలువ. ఆ విలువను కాపాడే కాపలాదారు కుర్చీలో ఉన్న నాయకుడు కాదు,వీధిలో నిలబడి ప్రశ్న అడిగే సామాన్యుడే. అతని గొంతు నొక్కడం అంటే ప్రజాస్వామ్య కోటకు కాపలా లేకుండా చేయడమే.ప్రశ్నను భరించలేని ప్రభుత్వం బలమైనది కాదు, బలహీనమైనది.ప్రశ్నకు సమాధానం చెప్పే పాలన మాత్రమే నిజమైన ప్రజాపాలన.

# సచిన్ రికార్డుకు ఎసరు పెట్టిన జో రూట్

ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్, స్టార్ బ్యాటర్ జో రూట్ టెస్ట్ క్రికెట్‌లో సరికొత్త హిస్టరీ క్రియేట్ చేశాడు. లండన్ నైట్‌క్లబ్ వివాదం వల్ల బెన్ స్టోక్స్ టీమ్‌కు దూరం అవ్వడంతో జో రూట్ మళ్లీ కెప్టెన్సీ బాధ్యతలు తీసుకున్నాడు. ఓవల్ మైదానంలో న్యూజిలాండ్‌తో జరిగిన సెండ్ టెస్ట్ మ్యాచ్ లో కెప్టెన్సీ ప్రెజర్ ఉన్నప్పటికీ రూట్ బ్యాటింగ్‌లో రెచ్చిపోయాడు. ఈ మ్యాచ్ లో 46, 77 రన్స్ స్కోర్ చేయడం ద్వారా టెస్ట్ క్రికెట్ హిస్టరీలోనే సచిన్ టెండూల్కర్ తర్వాత 14,000 రన్స్ మార్కును దాటిన రెండో బ్యాటర్‌గా రికార్డ్ క్రియేట్ చేశాడు. దీంతో క్రికెట్ ప్రపంచంలో ఇప్పుడు ఒకే ఒక ఇంట్రెస్టింగ్ డిస్కషన్ నడుస్తోంది. సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న 15,921 రన్స్ ఆల్ టైమ్ రికార్డును జో రూట్ బ్రేక్ చేయగలడా, అసలు ఆ రేర్ మైలురాయిని ఎప్పుడు అందుకుంటాడు అనే క్వశ్చన్ హాట్ టాపిక్‌గా మారింది. సచిన్ టెండూల్కర్ 2013 లో రిటైర్ అయినప్పుడు అతని 15,921 రన్స్ రికార్డ్ ఎవరూ బ్రేక్ చేయలేరని అందరూ అనుకున్నారు. అలిస్టర్ కుక్, విరాట్ కోహ్లీ, స్టీవ్ స్మిత్ లాంటి స్టార్స్ ట్రై చేసినా సచిన్ రికార్డుకు చాలా దూరంలోనే ఆగిపోయారు. ఒకప్పుడు ఈ రేసులో లేని జో రూట్, 2021 సంవత్సరం నుంచి తన ఆటతీరును కంప్లీట్‌గా మార్చేశాడు. 2021 లో అతను ఏకంగా 61 యావరేజ్‌తో 1,708 రన్స్ చేసి తన కెరీర్ లోనే బెస్ట్ పర్ఫార్మెన్స్ ఇచ్చాడు. ఆ తర్వాత నుంచి రూట్ సెంచరీల కన్వర్షన్ రేట్ డబుల్ అయింది. కెరీర్ ఫస్ట్ ఫేజ్ లో ప్రతీ 6 మ్యాచులకు ఒక సెంచరీ కొట్టిన రూట్, లాస్ట్ ఐదేళ్లలో ప్రతీ 3.5 మ్యాచులకే ఒక సెంచరీ బాదుతున్నాడు. ఈ మైండ్ బ్లోయింగ్ కన్సిస్టెన్సీ వల్లే సచిన్ రికార్డును రూట్ బ్రేక్ చేయడం ఇంపాజిబుల్ కాదు, అది కేవలం టైమ్ ఫ్యాక్టర్ మాత్రమే అని అనలిస్టులు చెప్తున్నారు. ఓవల్ టెస్ట్ ముగిసేసరికి జో రూట్ కెరీర్ టోటల్ 14,075 రన్స్ కు చేరింది. సచిన్ టెండూల్కర్ ఆల్ టైమ్ రికార్డును బ్రేక్ చేయాలంటే రూట్ ఇంకా 1,846 రన్స్ చేయాల్సి ఉంటుంది. రూట్ ఉన్న ప్రెజెంట్ ఫామ్ ప్రకారం చూస్తే మరో 25 టెస్ట్ మ్యాచ్‌లు లేదా 42 ఇన్నింగ్స్ ఆడితే ఈ రన్స్ ఈజీగా వచ్చేస్తాయి. అయితే ఇంగ్లాండ్ రాబోయే క్రికెట్ షెడ్యూల్ మునుపటి కంటే కాస్త తక్కువగా ఉంది. న్యూజిలాండ్ సిరీస్ తర్వాత ఆగస్టులో పాకిస్తాన్‌తో హోమ్ సిరీస్, ఆ తర్వాత సౌతాఫ్రికా టూర్ ఉన్నాయి. ఇక 2027 లో బంగ్లాదేశ్ సిరీస్, ఆస్ట్రేలియాతో 150వ యానివర్సరీ చారిత్రాత్మక టెస్ట్, ఆపై ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్ ఉన్నాయి. ఈ లెక్కన చూస్తే ప్రెజెంట్ డబ్ల్యూటీసీ సైకిల్ ముగిసేసరికి రూట్ సచిన్ రికార్డును దాటడం కష్టమే కావచ్చు. ప్రస్తుత ప్రొజెక్ట్ ప్రకారం, జో రూట్ ఈ వరల్డ్ రికార్డును బ్రేక్ చేసే గోల్డెన్ ఛాన్స్ 2028 స్టార్టింగ్‌లో జరిగే ఇండియా టూర్ లో వచ్చే అవకాశం ఉంది. అప్పటికి రూట్ ఏజ్ 38 ఇయర్స్ కి చేరుకుంటుంది. సచిన్ టెండూల్కర్ తన లాస్ట్ టెస్ట్ మ్యాచ్ ఆడిన ముంబైలోని వాంఖెడే స్టేడియంలోనే జో రూట్ ఈ ఆల్ టైమ్ రికార్డును బ్రేక్ చేస్తే క్రికెట్ హిస్టరీలోనే అది ఒక బిగ్గెస్ట్ పోయెటిక్ మూమెంట్ అవుతుంది. వయసు పైబడుతున్నా రూట్ ఫిట్‌నెస్, డ్యూరబిలిటీ అద్భుతంగా ఉన్నాయి. ఒకప్పుడు




ఇంపాజిబుల్ అనుకున్న సచిన్ రికార్డు పర్వతాన్ని జో రూట్ తన ప్రతీ ఇన్నింగ్స్ తో కరిగిస్తూ సంచలనం సృష్టిస్తున్నాడు.

# తీవ్ర భావోద్వేగానికి గురైన వైభవ్ సూర్యవంశీ

ఇండియా క్రికెట్ హిస్టరీలో సరికొత్త సంచలనం సృష్టిస్తున్న 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ ఇంటర్నేషనల్ కెరీర్ లో బిగ్గెస్ట్ మైలురాయిని అందుకున్నాడు. ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలకు వెళ్లే సీనియర్ టీ20 స్క్వాడ్‌కు అజిత్ అగార్కర్ సెలెక్షన్ కమిటీ వైభవ్‌ను ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. జూన్ 26 నుంచి ఐర్లాండ్ సిరీస్ స్టార్ట్ అవ్వబోతుండగా, హోటల్ రూమ్‌లో వైభవ్‌కు టీమిండియా అఫీషియల్ జెర్సీని అందజేశారు. దీనికి సంబంధించిన ఎమోషనల్ వీడియోను బీసీసీఐ తన అఫీషియల్ హ్యాండిల్‌లో షేర్ చేసింది. టీమ్ ప్రసిద్ధ త్రోడౌన్ స్పెషలిస్ట్ రఘు స్వయంగా వైభవ్ రూమ్‌కు వెళ్లి కిట్ బాక్స్ ఇచ్చాడు. రఘును చూడగానే వైభవ్ ఎంతో వినయంగా అతని పాదాలకు నమస్కరించి బ్లెస్సింగ్స్ తీసుకోవడం ఫ్యాన్స్ మనసులను గెలుచుకుంది. జెర్సీని చేతిలోకి తీసుకున్న తర్వాత వైభవ్ సూర్యవంశీ తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. “నిజంగా ఈ అనుభూతిని చెప్పడానికి మాటలు రావడం లేదు. ఏ కల కోసమైతే నేను ఫస్ట్ డే బ్యాట్ పట్టుకుని ప్రాక్టీస్ కోసం క్రికెట్ గ్రౌండ్‌కు వెళ్లానో, ఆ డ్రీమ్ ఈరోజు నెరవేరింది. నా లైఫ్ లో మోస్ట్ ఇంపార్టెంట్ స్టెప్ కంప్లీట్ అయింది. ఇది ఒక కలలా అనిపిస్తోంది. ఆ బ్లూ టీషర్ట్ పై నా పేరు చూడగానే ముఖంలో నవ్వు ఆపుకోలేకపోయా. కొన్నిసార్లు మనం అస్సలు ఊహించని అద్భుతాలు మన లైఫ్‌లో జరుగుతాయి, అవి నిజమైనప్పుడు ఎలా రియాక్ట్ అవ్వాలో కూడా అర్థం కాదు. నా సిట్యుయేషన్ కూడా ప్రెజెంట్ అలాగే ఉంది” అని వైభవ్ ఎమోషనల్‌గా చెప్పాడు. ఈ సిరీస్ లో వైభవ్ సూర్యవంశీకి నంబర్ 3 జెర్సీని కేటాయించారు. గతంలో ఇండియా లెజెండ్స్ అయిన హర్భజన్ సింగ్, సురేష్ రైనా లాంటి స్టార్స్ ఈ నంబర్ జెర్సీతోనే మైదానంలో అదరగొట్టారు. ప్రొఫెషనల్ కెరీర్ స్టార్టింగ్ లో నంబర్ 12 జెర్సీ వేసుకున్న వైభవ్, తన తల్లి సలహా మేరకే నంబర్ 3 కి చేంజ్ అయ్యాడు. 12 లో ఉన్న అంకెలను ప్లస్ చేస్తే (1o2) మూడు వస్తుందని, అలాంటప్పుడు డైరెక్ట్‌గా నంబర్ 3 ఎందుకు తీసుకోకూడదు అని అతని తల్లి చెప్పిన మ్యాథ్స్ ఈక్వేషన్ వైభవ్‌కు బాగా లక్ కలిసి వచ్చేలా చేసింది. ఐపీఎల్ లో రికార్డ్ రన్స్‌తో ఆరెంజ్ క్యాప్ గెలిచిన ఈ యంగ్ ఓపెనర్, అదే నంబర్ 3 జెర్సీతో ఇండియా సీనియర్ టీమ్‌లో సత్తా చాటాలని చూస్తున్నాడు. ఇండియా సీనియర్ టీ20 స్క్వాడ్‌లోకి ఎంట్రీ దక్కినప్పటికీ, ప్లేయింగ్ ఎలెవన్ లో ఓపెనర్‌గా గ్రౌండ్ లోకి దిగడం వైభవ్‌కు అంత ఈజీ కాదు. ఎందుకంటే ఓపెనింగ్ స్లాట్స్ కోసం టీమ్ లో ఆల్రెడీ సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ లాంటి సీనియర్ డ్యాషింగ్ బ్యాటర్లతో భారీ కాంపిటీషన్ ఉంది. ఐర్లాండ్‌తో జరిగే ఫస్ట్ మ్యాచ్ లో మేనేజ్‌మెంట్ వైభవ్‌కు డెబ్యూ క్యాప్ ఇస్తే, సచిన్ టెండూల్కర్ రికార్డును బ్రేక్ చేస్తూ ఇండియా తరపున ఇంటర్నేషనల్ క్రికెట్ ఆడిన అత్యంత పిన్న వయస్కుడిగా వైభవ్ సూర్యవంశీ సరికొత్త హిస్టరీ క్రియేట్ చేస్తాడు.




## ఢిల్లీ క్యాపిటల్స్‌లోకి రిషభ్ పంత్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ హిస్టరీలోనే మోస్ట్ సెన్సేషనల్ ప్లేయర్ ట్రేడింగ్ అఫీషియల్ గా కన్ఫర్మ్ అయింది. లక్నో సూపర్ జాయింట్స్ మాజీ కెప్టెన్ రిషభ్ పంత్ మళ్లీ తన పాత ఫ్రాంచైజీ అయిన ఢిల్లీ క్యాపిటల్స్ లోకి రీ-ఎంట్రీ ఇస్తున్నాడు. ఈ క్రేజీ ట్రేడ్‌కు ఐపీఎల్ గవర్నింగ్ బాడీ జూన్ 23 మంగళవారం అఫీషియల్ మీడియా స్టేట్‌మెంట్ ద్వారా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. “లక్నో సూపర్ జాయింట్స్ మాజీ కెప్టెన్ రిషభ్ పంత్ తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్ లోకి వస్తున్నాడు, అతని ప్లేస్ లో చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ లక్నో సూపర్ జాయింట్స్‌లో జాయిన్ కానున్నాడు” అని ఐపీఎల్ మేనేజ్మెంట్ తెలిపింది. ఈ మెగా డీల్ ఐపీఎల్ సర్కిల్స్‌లో ఒక బిగ్గెస్ట్ ఎన్‌కౌంటర్‌గా మారింది. ఈ ట్రేడింగ్ లో రిషభ్ పంత్‌కు భారీగా శాలరీ కట్ (పే కట్) అయింది. ఐపీఎల్ 2025 మెగా వేలంలో లక్నో సూపర్ జాయింట్స్ రికార్డ్ స్థాయిలో రూ. 27 కోట్లు పెట్టి పంత్‌ను కొనుగోలు చేసింది. ఐపీఎల్ హిస్టరీలోనే అత్యంత కాస్ట్లీ ప్లేయర్‌గా నిలిచిన పంత్, ఇప్పుడు ఢిల్లీ క్యాపిటల్స్ లోకి రావడం కోసం ఏకంగా రూ. 12 కోట్లు వదులు కున్నాడు. కేవలం రూ. 15 కోట్ల రివైజ్డ్ ప్రైస్ తోనే పంత్ ఢిల్లీ జెర్సీ వేసుకోబోతు న్నాడు. మరోవైపు కుల్దీప్ యాదవ్ తన ప్రెజెంట్ శాలరీ అయిన రూ. 13.50 కోట్ల సేమ్ ఫీజ్‌తోనే లక్నో సూపర్ జాయింట్స్‌లోకి వెళ్తున్నాడు. పంత్ శాలరీ గ్రాఫ్ ఈ రేంజ్ లో పడిపోవడం క్రికెట్ ఫ్యాన్స్‌ను బాగా షాక్ కు గురిచేసింది. గత రెండు సీజన్లుగా ఐపీఎల్ లో రిషభ్ పంత్ పర్ఫార్మెన్స్ అస్సలు బాలేదు. లక్నో సూపర్ జాయిం ట్స్ రూ. 27 కోట్లు పెట్టినా పంత్ ఆ రేంజ్ ఇంపాక్ట్ చూపించలేకపోయాడు. లాస్ట్ రెండు సీజన్లలో కలిపి 28 ఇన్నింగ్స్ ఆడిన పంత్, కేవలం మూడు సార్లు మాత్రమే యాభై కంటే ఎక్కువ రన్స్ స్కోర్ చేయగలిగాడు. ఇందులో ఒక సెంచరీ, రెండు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఐపీఎల్ 2025 లో 24.45 యావరేజ్, 133.16 స్ట్రైక్ రేట్‌తో కేవలం 269 రన్స్ మాత్రమే చేశాడు. 2026 సీజన్ లో కూడా పరిస్థితి పెద్దగా మారలేదు. 28.36 యావరేజ్, 138.05 స్ట్రైక్ రేట్‌తో 312 రన్స్ మాత్రమే స్కోర్ చేశాడు. బ్యాటింగ్ లోనే కాకుండా కెప్టెన్సీ లోనూ ఘోరంగా ఫెయిల్ అయ్యాడు. ఐపీఎల్ 2026 సీజన్ ముగిసిన వెంటనే లక్నో కెప్టెన్సీ నుంచి పంత్ తప్పుకున్నాడు. అయితే మేనేజ్‌మెంట్‌తో వచ్చిన గొడవల వల్లే అతన్ని కెప్టెన్సీ నుంచి సాక్ చేశారనే టాక్ కూడా గట్టిగా నడిచిం ది. పంత్ బ్యాడ్ ఫామ్ వల్లే లక్నో అతన్ని వదిలించు కోవాలని చూసింది. కరెక్ట్ టైమ్ లో ఢిల్లీ క్యాపిటల్స్ తమ పాత మ్యాచ్ విన్నర్ ను వెనక్కి తీసుకోవడానికి ఇంట్రెస్ట్ చూ పించింది. పంత్ ప్లేస్ లో లక్నో సూపర్ జాయింట్స్ లోకి వెళ్తున్న కుల్దీప్ యాదవ్ ఒంటిచేత్తో మ్యాచ్ లు గెలిపించగల కేపబిలిటీ ఉన్న స్పిన్నర్. లక్నో పిచ్ లపై కుల్దీప్ బౌలింగ్ చాలా ఎఫెక్టివ్ గా ఉంటుందని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. ఈ బిగ్ ట్రేడింగ్ ఐపీఎల్ 2027 సీజన్ విజువల్స్‌ను కంప్లీట్‌గా మార్చేయబోతోందని తెలుస్తోంది.



# చరిత్ర సృష్టించిన లియోనెల్ మెస్సీ

లియోనెల్ మెస్సీ ఫుట్‌బాల్ చరిత్రలో మరో అద్భుత మైలురాయిని అందుకున్నాడు. జూన్ 22, 2026న ఫిఫా వరల్డ్ కప్ 2026 గ్రూప్ జెలో ఆస్ట్రియాతో జరిగిన మ్యాచ్‌లో అర్జెంటీనా కెప్టెన్ రెండు గోల్స్ కొట్టి పురుషుల వరల్డ్ కప్ ఆల్ టైమ్ అత్యధిక గోల్స్ రికార్డును బద్దలు చేశాడు. ఇంతకుముందు జర్మనీ లెజెండ్ మిరోస్లావ్ క్లోజ్ 16 గోల్స్‌తో రికార్డు సృష్టించాడు. మెస్సీ ఈ మ్యాచ్‌లో 17వ గోల్‌తో ఆ రికార్డును సమం చేసి, 18వ గోల్‌తో దాటేశాడు. మ్యాచ్ డల్లాస్‌లోని స్టేడియంలో జరిగింది. మెస్సీ తొలుత పెనాల్టీ కిక్ మిస్ చేశాడు కానీ 38వ నిమిషంలో ఫకుండో మెడినా పాస్‌ను లెఫ్ట్ ఫుట్‌తో అందుకుని అద్భుత గోల్ చేశాడు. ఇది అతని 17వ వరల్డ్ కప్ గోల్. అప్పటికే అల్జీరియాపై హ్యాట్రిక్‌తో 16 గోల్స్ సాధించి క్లోజ్‌ను సమం చేశాడు. ఇన్జ్యూరీ టైమ్‌లో (90o5’) మరో గోల్ చేసి రికార్డును తనదిగా చేసుకున్నాడు. అర్జెంటీనా 2-0తో విజయం సాధించి నాకౌట్ స్టేజ్‌కు అర్హత సాధించింది. ఈ విజయంతో మెస్సీ వరల్డ్ కప్‌లో అత్యధిక విజయాలు, అత్యధిక మ్యాచ్‌లు, అత్యధిక నిమిషాలు వంటి ఇతర రికార్డులను కూడా విస్తరించాడు. మెస్సీ ఈ టోర్నమెంట్‌లో ఇప్పటికే 5 గోల్స్ చేశాడు. అతను 6వ వరల్డ్ కప్ ఆడుతున్న మొదటి ఆటగాడు. 38 ఏళ్ల వయసులో కూడా అతని ప్రదర్శన అద్భుతం. ఇంతకుముందు 2022లో వరల్డ్ కప్ గెలిచిన అర్జెంటీనా బ్యాక్ టు బ్యాక్ టైటిల్ కోసం ఆశలు కలిగించింది. మెస్సీ తండ్రి ఆరోగ్య సమస్యలు ఉన్నా, అతను జట్టుకు నాయకత్వం వహించి చరిత్ర సృష్టించాడు. ఇంటర్నేషనల్ గోల్స్‌లో క్రిస్టియానో రోనాల్డో (143) తర్వాత 121 గోల్స్‌తో రెండో స్థానంలో ఉన్నాడు. ఈ సాధనకు ప్రపంచవ్యాప్తంగా అభిమానులు, మాజీ ఆటగాళ్లు అభినందించారు. జ్లాటన్ ఇబ్రాహిమోవిక్, థియెర్రీ హెన్రీ వంటి లెజెండ్స్ మెస్సీ గ్రేట్‌నెస్‌ను ప్రశంసించారు. వికీపీడియా, మెస్సీ ఇప్పుడు 18 గోల్స్‌తో టాప్ స్కోరర్. మహిళల వరల్డ్ కప్ రికార్డు హోల్డర్ మార్టా (17)ను కూడా దాటేశాడు. అర్జెంటీనా గ్రూప్ జెలో 6 పాయింట్లతో టాప్‌లో ఉంది. మెస్సీ చిన్న వయసు నుంచి రికార్డులు బద్దలు చేస్తున్నాడు. 2006లో మొదటి వరల్డ్ కప్ గోల్ చేశాడు. ఇప్పుడు 6 ఎడిషన్లలో ఆడి చరిత్ర సృష్టించాడు. అతని సాంకేతిక నైపుణ్యం, లీడర్‌షిప్, హ్యూమిలిటీ అభిమానులను ఆకర్షిస్తున్నాయి. ఈ రికార్డు ఫుట్‌బాల్ ప్రపంచానికి మెస్సీ అని మరోసారి నిరూపించింది.




అర్జెంటీనా జట్టు ఆటగాళ్లు ఎంజో ఫెర్నాండెజ్ వంటి వారు మెస్సీని ఆనందంగా ఆలింగనం చేసుకున్నారు. ఈ విజయం అర్జెంటీనా ఫుట్‌బాల్ అభిమానులకు పండగ. బ్యూనస్ ఎయిర్స్‌లో సెలబ్రేషన్స్ జరిగాయి. మెస్సీ తన 39వ పుట్టిన రోజు సమీపంలో ఈ రికార్డు సాధించడం ప్రత్యేకం. ఫిఫా, అంతర్జాతీయ మీడియా ఈ సాధనను ప్రధాన హైలైట్‌గా ప్రచురించింది. మెస్సీ ఇంకా ఎన్నో రికార్డులు సాధించాలని అభిమానులు ఆశిస్తున్నారు. అతని కెరీర్ ఇంకా కొనసాగుతుందని భావిస్తున్నారు. మొత్తంమీద ఈ ఈవెంట్ ఫుట్‌బాల్ ప్రపంచాన్ని మెస్సీ మాయాజాలంలో ముంచేసింది. అతని అంకితభావం, నైపుణ్యం యువ ఆటగాళ్లకు స్ఫూర్తి. అర్జెంటీనా జట్టు బ్యాక్ టు బ్యాక్ వరల్డ్ కప్ గెలవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈ చరిత్రాత్మక సాధన ఫుట్‌బాల్ ఫ్యాన్స్‌కు ఎప్పటికీ గుర్తుండిపోతుంది.

# గాయంతో టీ20 జట్టు నుంచి నితీశ్ ఔట్..!

ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌కు ముందు టీమిండియాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తర్వాత ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి తొడ కండరాల గాయం కారణంగా ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. కాగా, నితీశ్ స్థానంలో యువ ప్లేయర్ సూర్యాంశ్ షెడ్జెను బీసీసీఐ మంగళవారం జట్టులోకి ఎంపిక చేసింది. జూన్ 26, 28 తేదీల్లో ఐర్లాండ్‌తో , జులై 1 నుంచి ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. అఫ్ఘానిస్థాన్‌తో వన్డే సిరీస్ ముగిసింది. భారత జట్టు త్వరలో ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌లో తలపడనుంది. ఇందులో శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో టీమిండియా బరిలోకి దిగనుంది. జూన్ 26, జూన్ 28 తేదీల్లో ఐర్లాండ్ వేదికగా ఈ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇప్పటికే బీసీసీఐ.. టీమిండియా జట్టును ఎంపిక చేసింది. కానీ మ్యాచ్‌లకు మూడు రోజుల ముందు టీమిండియాకు షాక్ తగిలింది. ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి గాయం కారణంగా ఈ సిరీస్‌లకు దూరమయ్యాడు. ఇప్పటికే మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి టీ20 జట్టు నుంచి వైదొలగగా.. తాజాగా తొడ కండరాల గాయం కారణంగా ఐర్లాండ్, ఇంగ్లాండ్‌లతో టీ20 సిరీస్‌కు అతడు అందుబాటులో ఉండడని బీసీసీఐ తెలిపింది. దీంతో ఈ సిరీస్‌లుకు నితీశ్ ప్లేసులో బీసీసీఐ సూర్యాంశ్ షెడ్జెను ఎంపిక చేసింది. ఈ మేరకు అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. అఫ్ఘాన్‌తో వన్డే సిరీస్‌లో ఆడుతూ.. నితీశ్ రెడ్డి గాయపడ్డాడు. నిజానికి నితీశ్‌కు చిన్నదెబ్బే తగిలిందని అంతా భావించారు. కానీ ఎమ్మారైలో అసలు విషయం తెలిసింది. తొడ కండరాలకు గాయమైందని.. అతడు కోలుకునేందుకు నాలుగు వారాల టైమ్ పడుతుందని సమాచారం.

PRINTED , PUBLISHED & " and OWNER By, "KASHAMOLLAVIJAYKUMAR," And Published At 5-234, RAMANDIR ROAD, PATANCHERU, SANGAREDDY, TELANGANA- 502319 And PRINTED atM/S LASRITHASAI PUBLICATIONDOOR NO.: 2-369-1, REVENUE WARD NO: 02, EEDGAROAD, NEAR RTC BUS STAND, PENUKONDA(TOWN & POST), PENUKONDAMANDAL, ANANTHAPUR, ANDHRAPRADESH - 515110. ,''Email ID," Kashamollavijaykumar@gmailcom " Editor & Pro KASHAMOLLAVIJAYKUMARR.N.I. NO : TGTEL/26/A5230 MOBILE NUMBER: 9912159120